VISALAANDHRA, VIJAYAWADA-4. Phone 376
* * * Regd No. H-203

విశాలాంధ్ర
చందా వివరాలు

	ఏజెంటు ద్వారా	పోస్టు ద్వారా
సంవత్సరం	రు. 31 00	రు. 34 00
ఆరు మాసాలు	15.50	17 00
మూడు మాసాలు	7 75	8·50
ఒక మాసం	2: 65	2 90

విశాలాంధ్ర

7ol 866

సంపుటి 14 సంచిక 265] విజయవాడ • 12-12-1964 శనివారం [4 పేజీలు 8 పై.

అశోకా శాండల్ పౌడర్
ఫేస్ - టాల్కం - ఆల్ పర్పస్ పౌడర్లు
ఉత్తమమైనమైసూరుచందనముతో తయారుచేయబడినవి. వీటిని వుపయోగించిన, దినమంతయూ దేహమును దుర్గంధం నుండి, వేసవి తాపం తెలియనివ్వదు. ముఖ్యంగా మొటిమలు, చెమటగుల్లలు, వగైరా చర్మవ్యాధులను ఉపశమింపచేయును.
విజయా కెమికల్స్,
మద్రాసు-7.

చారిత్రక పరిస్థితులలో జరుగుతున్న కమ్యూనిస్టుపార్టీమహాసభ

బలీయమైన రైతు ఉద్యమ నిర్మాణం ప్రధాన చర్చనీయాంశమని శ్రీ డాంగే ప్రకటన

పన్నులు ఎగవేసేవారి ఆచూకీ తీయడానికి ప్రత్యేక సి. ఐ. డీ. లు

న్యూఢిల్లీ, డిసెంబరు 10

పన్నులు ఎగవేసే వారిని కనిపెట్టటానికి ఆర్థికశాఖ తనిఖీ విభాగంలో సి. ఐ. డి. లను నియమించే విషయం ఆలోచనలో ఉందని ఆర్థికశాఖ ఉపమంత్రి శ్రీ రామేశ్వర్‌సాహూ, లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో నేడు తెలియజేశారు.

ఆరోగ్యశాఖ నిర్వహణ

దేశమంతటా ఆరోగ్య శాఖ పరిపాలనా విధానం ఒకే రకంగా ఉంచేటట్లు ఒక చట్టం తీసుకు రావడానికి ఆలోచిస్తున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి శ్రీమతి సుశీలా నయ్యర్ నేడు లోక్‌సభలో తెలియజేశారు. అస్సాం మైసూరు [illegible], కేరళ, మున్నగు రాష్ట్రాలు ఇటువంటి చట్టాన్ని చేయడానికి అధికారాలిస్తూ తీర్మానించాయన్నారు.

శ్రీ పి. ఆర్ చక్రవర్తి అడిగిన ప్రశ్నకు సమాధానం యిస్తూ దేశంలోని వైద్య కళాశాలలన్నిటిలోను ఒకే ప్రమాణం ఉండేటట్లు ఒక బిల్లును తెచ్చే ప్రతిపాదన ఇప్పుడేమీ లేదని మంత్రి తెలియజేశారు.

హోమియోపతి వైద్యానికి ఒక ప్రమాణం [illegible] పరిశీలిస్తోందన్నారు.

సభ్యులు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానంగా కలరా నిరోధానికి నిర్దిష్టకార్యక్రమం ఉందని మంత్రి జవాబిచ్చారు. నాల్గవ ప్రణాళికా కాలంలో 48 జిల్లాలలో నీటిసరఫరా పథకాలను ప్రవేశపెడుతున్నామని తెలియజేశారు.

మరో ప్రశ్నకు సమాధానంయిస్తూ గత ఆరేళ్ల కాలంలోను మలేరియా వ్యాధి చాలా గణనీయంగా తగ్గిపోయిందని మంత్రి తెలియజేశారు. అయితే ఏరాష్ట్రమూ పూర్తిగా మలేరియాను నిర్మూలించినట్లుచెప్పలేమనిఆమెఅన్నారు. నాగభూమి, గుజరాత్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ లలో అనేక కారణాలవలన మలేరియా వ్యాధి నిరోధక కార్యక్రమంపై ముకబడుతూందన్నారు నాగభూమిలో ఆందోళనకర పరిస్థితి ఉండటం వలన అక్కడ ఈ కార్యక్రమం వెనుకబడుతోందన్నారు.

సువర్ణరేఖ నదీజలాలు

ఒరిస్సాలోని సువర్ణరేఖ నదీ జలాల పంపకం గురించి ఒరిస్సా, బీహార్ మధ్యప్రదేశ్‌లమధ్య ఒప్పందం కుదిరిందని కేంద్ర నీటిపారుదల, విద్యుచ్ఛక్తిశాఖా మంత్రి డాక్టర్ కె. ఎల్. రావు నేడు లోక్‌సభలో తెలియజేశారు.

ఒరిస్సా ప్రభుత్వం ఈ నదిపై ప్రాజెక్టు నిర్మాణానికి పరిశీలన జరిపి నివేదిక అందజేయవలసివుంటుందని అన్నారు.

నాల్గవ ప్రణాళికలో వస్త్రోత్పత్తి

నాల్గవ ప్రణాళికలో వస్త్రోత్పత్తి లక్ష్యం గురించి ఇంకా తుది నిర్ణయం చేయలేదనీ 1120 కోట్ల గజాలు 1140 కోట్ల గజాలమధ్య ఉండవచ్చుననీ వాణిజ్యశాఖా మంత్రి శ్రీ మనూభాయిషా నేడు రాజ్యసభలో తెలియజేశారు.

మిల్లులకు 800 కోట్ల గజాలు, విడివిడిగా ఉన్న ఉత్పత్తి కేంద్రాలకు 520 కోట్ల గజాలు కేటాయించాలని ప్రణాళిక సంఘం ప్రతిపాదించబడింది. బట్టలమిల్లులు ఏటేటాయిప్పుడు 520 కోట్ల గజాలవరకు ఉత్పత్తిచేసే ప్రమాణాన్ని అందుకున్నా"యని అన్నారు.

మిల్లుల ఉత్పత్తి క్రమంగా పెరుగుతూందనీ, కదుర్లు కోటినుండి 1 కోటి 56 లక్షల వరకు ఇటీవలనే పెరిగాయనీ అన్నారు

అయితే వికేంద్రీకరించబడిన రంగంలో ఉత్పత్తి పెరిగినంత ఎక్కువగా మిల్లుల్లో ఉత్పత్తి పెరగలేదని అన్నారు.

బట్టల ఎగుమతిద్వారా వచ్చే ఆదాయంలో నాల్గవ వంతును, తమ మిల్లులకు కొత్త యంత్రాలను దిగుమతి చేసుకోడానికి మిల్లు యజమానులకు అనుమతి యివ్వాలని మరో ప్రశ్నకు ఉపమంత్రి శ్రీ రామస్వామి తెలియజేశారు. 1964 అక్టోబరునుండి ఇంతవరకు సుమారు ఆధునికమైన 28 లక్షలకదుర్లు 25 వేల మగాలు దిగుమతిచేయబడినవని ఇందుకు రు. 30-40 కోట్ల వరకు అయిందనిఅన్నారు.

దేశంలో లభించని బట్టలమిల్లు యంత్రాలనే విదేశాలనుండి తెప్పించుకోడానికి అనుమతి యిస్తున్నామని మంత్రి తెలియజేశారు.

రైల్వేల్లో దొంగతనాలు

రైల్వే రక్షకశాఖ కృషివలన రైల్వేలో సరుకులు ఎత్తుకుపోవడం గణనీయంగా తగ్గిందనిరైల్వేశాఖ మంత్రి డాక్టర్ రామసుభగ్‌సింగ్, నేడు రాజ్యసభలో తెలియజేశారు.1962-63లో 5891 కేసులు ఉండగా 1963-64 లో 3466 లో కేసులు మాత్రమే వచ్చాయని అన్నారు. ఈ కేసులలో రైల్వేశాఖ ఉద్యోగులు ఎక్కువగా ఉన్న విషయం వాస్తవం కాదా అన్న ప్రశ్నకు డాక్టర్ రామసుభగ్‌సింగ్ సమాధానం యిస్తూ ఈ అంకెలను సేకరిస్తామని అన్నారు.

మరో ప్రశ్నకు శ్రీ మనూభాయి షా సమాధానం యిస్తూ, మధ్యప్రదేశ్‌లోని రాజనందగామ్ బట్టలమిల్లు మూతపడకుండా నడిపించేటట్లు చూడవలసిందిగా మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి తాము తెలియజేశామని అన్నారు. ఈ మిల్లు యంత్రాలు, మిల్లు మేనేజిమెంటు కూడా చెడ్డగా ఉన్నాయని అన్నారు.

హిందూస్థాన్ యంత్ర పరికరాల ఫ్యాక్టరీ

హిందూస్థాన్ యంత్ర పరికరాల ఫ్యాక్టరీ విభాగాన్ని ఒక దానిని మధ్యప్రదేశ్‌లో నెలకొల్పడానికి కేంద్రం ఆమోదించినట్లు పరిశ్రమల, భారీ ఇంజనీరింగ్‌మంత్రి శ్రీ టి. యన్. సింగ్, శ్రీ ప్రతాప్‌సింగ్ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

బొగ్గుగనులున్న భూములకు నష్టపరిహారం

బొగ్గు లభ్యమయ్యే ప్రాంతాలను బొగ్గు జాతీయాభివృద్ధి కార్పొరేషన్ స్వాధీనపరచుకున్నప్పుడు ఆ యా రాష్ట్రాలకు తగు నష్టపరిహారం యివ్వడానికి నిశ్చయించినట్లు గనులు, ఉక్కుశాఖామంత్రి శ్రీ సంజీవరెడ్డి నేడు రాజ్యసభలో తెలియజేశారు.

వంశధార ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతి

ఇంకా లభించలేదని

శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 10

శ్రీకాకుళం జిల్లాలోని వంశధారప్రాజెక్టుకు కేంద్ర జలవిద్యుత్ కమిషన్ నుండి సాంకేతిక అనుమతి లభించలేదని, అనుమతి రావటంలోనే పని త్వరితం చేయబడు తుందని పబ్లిక్‌వర్క్సు మంత్రి , శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి నేడు శాసనసభలో చెప్పారు. దీనికి రూ 13.85 కోట్లు ఖర్చుకాగలదని చెప్పారు.

శ్రీ పి. గున్నయ్య తెచ్చిన ఒక తీర్మానంపై శ్రీ సుబ్బారెడ్డి ప్రసంగిస్తూ ఈ ప్రాజెక్టు ప్రాథమికపని సాగుతున్నదన్నారు.

ఈ ప్రాజెక్టుకోసం రెండవ ప్రణాళికలోగా 0.61 లక్షలు ఖర్చు పెట్టబడిందని మూడవ ప్రణాళికలో దీనికి 33.18 లక్షలు కేటాయించామని, నాల్గవ ప్రణాళికలో 6 కోట్లు కేటాయిస్తామనీ అన్నారు.

కేంద్ర జలవిద్యుత్ కమిషన్ చేసిన కొన్ని వ్యాఖ్యానాలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానాలు పంపిందన్నారు. సాధ్యమయినంత త్వరలో ప్రాజెక్టుకు అనుమతిని సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు.

ఈ ప్రాజెక్టుకు 2 76,700 ఎకరాలకు నీరు అందించడానికివీలుగారూపకల్పనచేశారు.

బ్రిటిష్ గయానా :

తాను రాజీనామా ఇవ్వనవసరంలేదని చెడిజగన్ ప్రకటన

జార్జిటౌన్ (బ్రి. గయానా) డిసెంబరు 11

బ్రిటిష్ గయానా ప్రధాని డాక్టర్ చెడి జగన్ తన ప్రభుత్వం రాజీనామా యివ్వబోవడం లేదని నిన్న యిక్కడ జరిగిన ఒక పత్రికా గోష్ఠిలో తెలియజేశారు. తత్ఫలితంగా దేశంలో 'రాజకీయ ప్రతిష్టంభన' యేర్పడిందంటూ బ్రిటిష్ గవర్నర్ సైన్యాన్ని రంగంలోకి దింపాడు.

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో తమ పార్టీకి (పీపుల్స్ ప్రోగ్రెసివ్ పార్టీ) అన్నిపార్టీల కంటే మెజారిటీ వచ్చినా, గవర్నర్ తమకు ప్రభుత్వాన్ని యేర్పాటుచేసే అవకాశం నిరాకరిస్తున్నందువల్లనే తానీ చర్య తలపెట్టినట్లు జగన్ చెప్పారు.

దామాషా ఓటింగ్ పద్ధతిన బ్రిటన్ జరిపించిన "యీ ఎన్నిక కుట్రమోసం, అందుకని న్యాయతః యిప్పటికినీ ప్రభుత్వమే అధికారంలో వున్నట్టులెక్క" అని అయన అన్నారు.

"నా ప్రభుత్వం రాజీనామా యివ్వదని గవర్నర్‌కు చెప్పేశాను. బ్రిటిష్ గవర్నమెంటు మమ్మల్ని తరిమివేస్తుందేమో చూద్దాం. వాళ్ళింతవరకూ దేశాన్ని [illegible]ద్వారా పరిపాలిస్తున్నారు" అని అయన అన్నారు.

'రాజకీయ ప్రతిష్టంభన'

గత సోమవారంనాడు యీ సాధారణ ఎన్నికలు జరిగాయి. మొత్తం జాతీయ శాసనసభ సభ్యుల సంఖ్య 53. డాక్టర్ జగన్ నాయకత్వం వహిస్తున్న పార్టీకి 24 స్థానాలు, డాక్టర్ బర్నాం నాయకత్వాన వున్న పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్‌కు 22, మరో పోర్చుగీసు మితవాద నాయకుని అనుచరులకు 7 స్థానాలుదక్కాయి.

ఈ స్థితిలో రాజీనామా యివ్వడానికి జగన్ ప్రభుత్వం నిరాకరించడంలో బ్రిటిష్ గయానాలో మరోసారి 'పెద్దరాజ్యాంగ సంక్షోభం' యేర్పడినట్లేనని పరిశీలకులు భావిస్తున్నారు.

డాక్టర్ జగన్, బర్నాం పార్టీతో కలిసి మిశ్రమ ప్రభుత్వం యేర్పాటుకు సుముఖంగానే వున్నారు. అయితే బర్నాం మాత్రం యిందుకు సుతరాము అంగీకరించడంలేదు.

7 స్థానాలున్న పోర్చుగీసు నాయకుని పార్టీ బర్నాంను సమర్థించడానికి సిద్ధమైంది. వుంది. బ్రిటిషగవర్నర్‌తో సంభాషించిన బర్నాం పత్రికలవారితో "కొద్దిగా ఓపికపట్టండి ; నేనే ప్రధాని నౌతాను. గయానాకు సుపరిపాలన ప్రసాదిస్తాను" అన్నారు.

పరిస్థితి యిలావుండగా రాజ్యాంగ సంబంధమైన మరో చిక్కుకూడా యేర్పడింది. 1963లో బ్రిటిష్‌వలసశాఖ మంత్రి శాండిస్ ప్రతిపాదితమైన రాజ్యాంగం మేరకే యీ జనరల్ ఎన్నికలు జరిగాయి. అయితే పోలింగ్ తేదీ నాటికి జగన్ ప్రభుత్వం రద్దు చేయబడలేదు

రాజ్యాంగ సంబంధమైన యీ చిక్కులను విడదీసేటందుకు గవర్నర్‌కు అధికారంలేదు.

(మిగతా 3 వ పేజీలో)

గమనిక

హైదరాబాద్, డిసెంబరు 12

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుసమితి కార్యాలయంవారు ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు :

బొంబాయిలో జరిగే భారత కమ్యూనిస్టుపార్టీ 7వ మహాసభ సందర్భములో ఆంధ్ర ప్రాంతం నుంచి చాలా మంది వెళ్ళుటకు సంసిద్ధమగుచూ, వసతి సౌకర్యములు ఏర్పాటు చేయవలసినదిగా హైదరాబాద్ ఆఫీసునకు వ్రాస్తున్నారు ఈ విషయం బొంబాయిలోని ఆహ్వాన సంఘము వారికి తెలియచేయగా, వారు తాము ఏ ఏర్పాట్లు చేయలేమని వ్రాసినారు. కనుక గుంటూరులో జరిగిన ప్రదేశ్ మహాసభలో ఎన్నికైన ప్రతినిధులు, ప్రేక్షకులు మాత్రమే ఆహ్వానసంఘం వారు వసతి వగైరా ఏర్పాట్లు చేయగలుగుతారనీ, ఈ విషయం గమనించవలసిందనీ కోరుతున్నాము.

17 దేశాల నుంచి సౌహార్ద ప్రతినిధులు వస్తున్నట్లు వెల్లడి

బొంబాయి, డిసెంబరు 10

మనదేశం అత్యంత క్లిష్ట పరిస్థితులలో వున్న సమయంలో భారత కమ్యూనిస్టుపార్టీ సప్తమ మహాసభ బొంబాయిలో జరుగబోతున్నదని, భూసమస్యపై బలీయమైన రైతు ఉద్యమాన్ని నిర్మించే విషయంగురించి ఈ మహాసభలో ప్రధానంగా చర్చించగలమని పార్టీ అధ్యక్షులు శ్రీ ఎస్. ఏ. డాంగే నేడిక్కడ పత్రికా గోష్ఠిలో ప్రకటించారు.

బొంబాయి మహాసభలో భూ సంస్కరణలను గురించి ప్రధానంగా చర్చించగలమని, భూ సమస్య పరిష్కారం కావాలంటే బలీయమైన రైతు ఉద్యమాన్ని నిర్మించడమొక్కటే మార్గమని కమ్యూనిస్టు పార్టీ భావిస్తున్నదని శ్రీ డాంగే వివరించారు.

డిసెంబరు 13 నుంచి 23 వ తేదీ వరకు బొంబాయిలో జరుగుతున్న ఈ మహాసభలో జాతీయ, అంతర్జాతీయ సమస్యలు చర్చకు వస్తాయి.

ఆసియా, ఆఫ్రికా సౌహార్దం దృష్ట్యా భారత ప్రభుత్వ వైదేశికనీతి ఏవిధంగా వుండాలన్న అంశంకూడా చర్చించగలమని శ్రీ డాంగే పేర్కొన్నారు.

దేశం నలుమూలలనుంచి 500 మందికి పైగా ప్రతినిధులు ఈ మహాసభకు హాజరవుతున్నారు. 17 దేశాలనుంచి సౌహార్ద ప్రతినిధులు ఈమహాసభకు వస్తున్నారు. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి పొనమరోవ్, నాయకత్వాన ఒక ప్రతినిధివర్గం రష్యానుంచి వస్తున్నది.

భారతకమ్యూనిస్టు పార్టీ 40 దేశాల సోదర పార్టీల ప్రతినిధులను ఈ మహాసభకు ఆహ్వానించిందని, ఆహ్వానించబడిన దేశాలలోచైనా, అల్బేనియా, ఇండోనేసియా కమ్యూనిస్టు పార్టీలుమాత్రం లేవని శ్రీడాంగేతెలియజేశారు

బొంబాయిమహాసభకు ఆంధ్రనుంచి ప్రతినిధుల పయనం: విజయవాడ స్టేషన్‌లో ఘనమైన వీడ్కోలు

విజయవాడ, డిసెంబరు 10

బొంబాయిలో రేపు ఆదివారంనుంచి ప్రారంభం కానున్న భారత కమ్యూనిస్టు పార్టీ సప్తమ మహాసభకు ఆంధ్ర ప్రతినిధులు నేడిక్కడ నుండి బొంబాయికి బయలుదేరారు.

విజయవాడనుంచి నేడు బొంబాయికి బయలుదేరిన ప్రతినిధులలో విజయవాడ, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, గుంటూరు జిల్లాల కమ్యూనిస్టు నాయకులు వున్నారు.

ఈ ప్రతినిధులకు విజయవాడ స్టేషన్‌లో స్థానిక కమ్యూనిస్టు కార్యకర్తలు, సానుభూతిపరులు ఘనమైన వీడ్కోలిచ్చారు.

పార్టీ మహాసభ ప్రతినిధులకు రైల్వే అధికారులు కేటాయించిన ప్రత్యేక రైలుపెట్టెను ఎర్రజెండాలతోను, బ్యానర్లతోను చక్కగా అలంకరించారు.

రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ నంబు అప్పారావు, కృష్ణాజిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ ఎన్. ఆర్ దాసరి, విజయవాడ పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ టి. వెంకటేశ్వరరావు రాష్ట్ర వ్యవసాయ కూలీ నాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు, శ్రీ కో[illegible] సుబ్బారావు, తూర్పు గోదావరి జిల్లా కమ్యూనిస్టునాయకులు శ్రీ పెదపాటి వెంకట్రావు మున్నగునాయకులు నేడుబయలుదేరినప్రతినిధులలో వున్నారు.

విశాఖజిల్లా ప్రతినిధులు శ్రీ వై. విజయకుమార్, శ్రీ కె వల్లభరావు, శ్రీ యు [illegible] జి. రామినాయుడు, యమ్. సూరిబాబుగార్లు కూడా ఇదే రైలులో వెళ్లారు.

శ్రీకాకుళం జిల్లానుండి శ్రీ అప్పాయి నాయుడు, శ్రీ ప్రసాద్ తదితరులుకూడా వీరితోపాటు కలిసి వెళుతున్నారు.

జాతీయ సమితి సభ్యులు ఇంతకుముందే బొంబాయికి బయలుదేరి వెళ్లారు.

'విశాలాంధ్ర' ప్రధాన సంపాదకులు శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావు మొన్ననే బొంబాయి వెళ్ళారు. పట్టణ పార్టీ నాయకులు శ్రీ చలసాని వెంకటరత్నం కూడా ముందుగానే బయలుదేరి వెళ్ళారు

విశాలాంధ్ర సంపాదకులు శ్రీ బలరామమూర్తి, సహాయ సంపాదకులు శ్రీ బి. రామచంద్రరావుగార్లు బస్‌లో హైదరాబాద్ వెళ్ళారు. హైదరాబాద్‌నుండి ఈ ప్రతినిధులతో పాటు, మరికొందరు కూడా కలిసి రేపు రాత్రి 8 గంటలకు బొంబాయి బయలు దేరుతారు. మరొక విశాలాంధ్ర సహాయ సంపాదకులు శ్రీ ఈదుపుగంటి నాగేశ్వరరావుగారు ఇప్పుడు ప్రతినిధులతోపాటు బయలుదేరారు.

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ యన్ రాజశేఖరరెడ్డి ప్రస్తుతం యుగోస్లావియా కమ్యూనిస్టు మహాసభలో పాల్గొనేందుకు బెల్‌గ్రేడ్‌లో వున్నారు. అయన 13 వ తేదీకి బొంబాయికితిరిగివస్తారు.

ఇక్కడనుంచి బయలుదేరివెళ్ళిన గుంటూరు జిల్లా ప్రతినిధులలో శ్రీయుతులు పెరవలి శ్రీరాములు, కృపాదానం, నల్లూరి అంజయ్య, లోకం వెంకటేశ్వరరావులు వున్నారు.

సోవియట్ ప్రధాని ప్రసంగంపై అమెరికాప్రతినిధివ్యాఖ్య

వాషింగ్‌టన్, డిశంబరు 10

భవిష్యత్‌లో తమ రక్షణ బడ్జెట్లను తగ్గించుకోవాలని అమెరికా-రష్యాల మధ్య అంగీకారం ఏదీ కుదరలేదని అమెరికా అధ్యక్ష కార్యాలయం ప్రతినిధి నేటి రాత్రి అన్నారు.

అమెరికా రక్షణ బడ్జెట్ దేశ అవసరాలకనుగుణంగా రూపొందింద బడుతుందని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ నిరవధికంగా వాయిదా

ప్రణాళికా రచయితలు సామాన్యుని దృష్టిలో వుంచుకోవటంలేదని చివరిరోజు చర్చలో శ్రీ పిల్లలమర్రి విమర్శ

హైదరాబాద్, డిసెంబరు 11

నాల్గవ ప్రణాళిక ముసాయిదాపై చర్చ పూర్తయిన అనంతరం ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ సమావేశం నేడు నిరవధికంగా వాయిదా పడింది.

ప్రణాళికపై జరిగిన చర్చను ప్రతిపక్షంతరపున శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు ముగిస్తూ మన ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలు సామాన్యుని జీవిత పరిస్థితుల్ని మెరుగుపరచడానికేననీ అయితే ప్రణాళికా రచయితలకు ఆదృష్టి వున్నట్లు లేదనీ అన్నారు

మొదటి మూడు పంచవర్ష ప్రణాళికలలో ఆర్థిక అసమానత్వం తొలగించాలని, వగైరా లక్ష్యాలు ప్రకటించడం జరిగిందని, కాని 4 వ ప్రణాళికకు లక్ష్యం శూన్యం అని అన్నారు.

అయనింకా యిలా అన్నారు :

దేశంలో నిరుద్యోగం మహమ్మారిలాగా పెరిగిపోతోంది. 4వ ప్రణాళికా కాలంలో దేశంలో సుమారు 8 కోట్ల మంది నిరుద్యోగులుంటారు. ఆంధ్రలో సైతం నిరుద్యోగ ప్రమాదం తీవ్రంగా వుంటుంది.

గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగుల సంగతి అటుంచి. పట్టణాలలో నిరుద్యోగులుగా తమ పేర్లు నమోదు చేయించుకున్నవారిలో 50 శాతం మందికయిన ఉద్యోగాలు చూపించలేక పోతున్నారు.

ఈ ప్రణాళికలో నిరుద్యోగ నివారణ లక్ష్యంగా పెట్టుకొని ఉండవలసింది. ఆ సంగతి ఎక్కడా ప్రస్తావన లేదు.

మన రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పనిదే నిరుద్యోగం తొలగదు. నిరుద్యోగం తొలగకపోతే రాష్ట్ర ఆదాయం పెరగదు. తద్వారా వెనుకబాటుతనం నుండి బయటపడటం అసాధ్యమవుతుంది.

దేశంలో నూటికి 60 మందికినెలకు రు.19 ఆదాయంతో బ్రతుకులు వెళ్ళబుచ్చుతుంటు

(మిగతా 4 వ పేజీలో)

పార్లమెంటుసభ్యునికి టికెట్ కలెక్టరుకు మధ్య ఘర్షణ

రాజ్యసభలో చర్చ

న్యూఢిల్లీ, డిసెంబరు 10

గత అక్టోబరు 17 వ తేదీన మన్మాడ్ స్టేషన్‌లో పార్లమెంటు సభ్యుడు శ్రీ బి. పి. మౌర్యకు ఒక టికెట్‌కలెక్టరుకు మధ్య ఘర్షణ జరిగిందనీ, ఈ సందర్భంలో ఇద్దరికీ దెబ్బలు తగిలాయనీ, ఈ విషయం పోలీసు విచారణలో వుంది. గనుక ఇప్పుడు ఏమీ వివరాలు చెప్పడానికి వీలుపడదనీ రైల్వే మంత్రి శ్రీ ఎస్.కె. పాటిల్ నేడు రాజ్యసభలో తెలియజేశారు.

ఈ ఉభయులు పోలీసుకిర్యాదులు చేశారనీ మంత్రి అన్నారు.

మన్మాడ్ ఆసుపత్రిలో శ్రీమౌర్యకుప్రాథమిక చికిత్స చేయడానికి కూడా నిరాకరించిన మాట వాస్తవమా అని ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు శ్రీ పాటిల్ సమాధానం యిస్తూ ఉభయులగురించిన వైద్యులనివేదికలు అందినవనీ, ఒకరికి తగిలిన గాయాలు గురించి చెబితే మరొకరి గాయాలు గురించి కూడా చెప్పాల్సి ఉంటుందనీ అన్నారు.

ప్రధానితో ఎన్నికల కమిషనర్ సంభాషణ

న్యూఢిల్లీ, డిసెంబరు 10

ఎన్నికల చీఫ్ కమిషనరు శ్రీ సుందరమ్ నేడు ప్రధాని శాస్త్రితో సంభాషణ జరిపారు. ఏఏ విషయం మాట్లాడుకున్నదీ తెలియదు. అంతకు ముందు శ్రీ వి. కె. కృష్ణమీనన్, సర్జూపాండే మొదలయిన కొందరు ప్రధాని శాస్త్రిని కలుసుకున్నారు.

గుత్తపెట్టుబడిదారీ రంగమే ప్రస్తుత సంక్షోభానికి కారణం

4 వ ప్రణాళిక ముసాయిదాపై చర్చను ముగిస్తూ శాసనమండలిలో శ్రీ సదాశివన్ ఉద్ఘాటన

హైదరాబాద్, డిసెంబరు 10

గత కొలది సంవత్సరాలుగా తలెత్తిన గుత్తపెట్టుబడిదారీ రంగం ప్రస్తుత సంక్షోభానికి కారణమని కమ్యూనిస్టు సభ్యుడు [illegible] సదాశివన్ నేడు శాసన మండలిలో 4 వ ప్రణాళికా ముసాయిదాపై ప్రసంగిస్తూ ఉద్ఘాటించారు.

ఆంధ్ర ప్రదేశ్‌లో వ్యవసాయం ఒక పరిశ్రమగా అభివృద్ధి చేయబడుతుందని, యాంత్రీకరణకై ఎక్కువ శ్రద్ధ వహిస్తామని చర్చకు సమాధానం యిస్తూ ఆర్థిక మంత్రి డాక్టర్ యం. చెన్నారెడ్డి చెప్పారు.

మైనర్ ఇరిగేషన్ పథకాలకు కేటాయించిన 25 కోట్లలో కోతవుండదని అయన హామీ యిచ్చారు.

నాగార్జున సాగర్‌వంటి పెద్ద పథకాలకు 3 వ ప్రణాళిక నిధులలో 30 శాతాన్ని ఖర్చుపెట్టినందున రాష్ట్రంలో తలసరి ఆదాయం పెరగ లేదన్నారు.

రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి సంతృప్తికరంగావుందనీ, పారిశ్రామికీకరణపైన మన దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు.

శ్రీ బి. సదాశివన్ చర్చను ముగిస్తూ, గత కొలది సంవత్సరాలుగా పబ్లిక్, ప్రయివేటు రంగాలుగాక గుత్త పెట్టుబడిదారీ రంగం ఒకటి పెరుగుతున్నదని ఈ రంగమే ప్రస్తుత సంక్షోభానికి కారణమని అన్నారు.

జిల్లాలలో, తాలూకాలలో పలుకుబడిగలిగిన కొందరు వ్యక్తులు ప్రభుత్వం ఋణాలు సంపాయించి ఆ చుట్టుపట్ల సరకుకొని నిల్వచేయటం కొంతకాలంతర్వాత విపరీతలాభాలకు వాటిని అమ్ముకోవటం చేస్తున్నారనీ. వీరు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్నారని అన్నారు.

శ్రీ పి. వి. రామువారి మాట్లాడుతూ వచ్చే నాల్గు సంవత్సరాలలో రాష్ట్రంలో అవిద్యను రూపుమాపడానికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రణాళికలు మధ్యతరగతి ప్రజల్ని అణగగొడుతున్నాయని శ్రీ హీరాలాల్ మోరియా అన్నారు.

తర్వాత శాసనమండలి, సమావేశం నిరవధికంగా వాయిదా పడింది.

గాంబియా స్వాతంత్ర్యం

లండన్ డిసెంబరు 10

గాంబియా స్వాతంత్ర్యాన్నిగురించేబిల్లును బ్రిటిష్ పార్లమెంటు నేడు ఆమోదించింది. పశ్చిమాఫ్రికాలో బ్రిటన్‌కు మిగిలి ఉన్న ఆఖరువలస గాంబియా ఫిబ్రవరిలో స్వతంత్ర దేశమవుతుంది.

కాంగోలో వలసపాలనపునఃప్రతిష్ఠే పశ్చిమ రాజ్యాల దాడి ఉద్దేశం

భద్రతాసంఘంలో గినీ ప్రధాని ఉద్ఘాటన

ఐక్యరాజ్యసమితి, డిసెంబరు 10

నేటి భద్రతాసంఘ సమావేశంలో ఘనా, సూడాన్, బ్రెజ్‌విల్లి ప్రతినిధులతోపాటు, గినీ, మాలి, అల్జీరియా రాజ్యాల ప్రతినిధులు కూడా పశ్చిమరాజ్యాల, [illegible]పట్ల ఆఫ్రికావాసులకు గల క్రోధావేశాలను ప్రతిబింబించారు. సామ్రాజ్యవాద పాలనను కాంగోలో తిరిగి నెలకొల్పేందుకే పశ్చిమ రాజ్యాలు ఈ దాడి జరిపాయని గినీ విదేశాంగ మంత్రి స్పష్టీకరించారు.

(ఘనా, సూడాన్, బ్రెజ్‌విల్లి ప్రతినిధుల ప్రసంగ భాగాలను నిన్ననే ఇచ్చాం)

నేటి సమావేశంలో కూడా ఆఫ్రికా రాజ్యాల ప్రతినిధులు కాంగోలో పశ్చిమ రాజ్యాల దౌర్జన్యాన్ని ఖండిస్తూ తీవ్రమయిన ప్రసంగాలు చేశారు. ఆఫ్రికా ప్రతినిధుల ప్రసంగాలు పశ్చిమ రాజ్యాల ప్రతినిధులను నివ్వెరపోయేటట్లు చేశాయి. ఆఫ్రికాప్రతినిధుల కోపోద్రేకాలను తాము అర్థం చేసుకోలేకుండా ఉన్నామని పశ్చిమ రాజ్యాల ప్రతినిధులు అన్నారు.

కాంగోలో సామ్రాజ్యవాద పాలనను తిరిగి నెలకొల్పే ఉద్దేశ్యంతోనే స్టాన్లీవిల్లిపై అమెరికా - బెల్జియం గాలిగుమ్మట దళాలు దాడిచేశాయని గినీ విదేశాంగ మంత్రిలూయీస్ బీవ్యాగి అన్నారు.

గినీ ప్రతినిధి ప్రసంగిస్తూ పాట్రిస్ లుముంబా హత్య, విమాన ప్రమాదంలో హామర్షెల్డ్ మరణం, కాంగోలో బలూబా జాతివారిని హత్యచేయటం, క్యూబాపై అమెరికా దాడి మొదలైన సామ్రాజ్యవాదుల హింసాకాండను ప్రస్తావించారు.

అయన ఇంకా ఇలా అన్నారు : "కొద్దిమంది శ్వేత జాతీయుల మరణానికి పశ్చిమ రాజ్యాలలోని పత్రికలు యెందుకంత గగ్గోలు చేస్తాయి? బెల్జియమ్ - అమెరికా దళాలు స్టాన్లీవిల్లిలో ప్రవేశించిన తరువాతే, [illegible] పరితంగా శ్వేతజాతి [illegible] ప్రాణాలు కోల్పోయారని అమెరికా వార్తాపత్రికలు తెల్పుతున్నాయి. కాని, అమెరికా విమానాలలో వచ్చిన దక్షిణాఫ్రికా జాతీయులు, రొడీషియా శ్వేత జాతి కిరాయి సైన్యాలు బెల్జియం దళాలు [illegible] కాంగో వాసులను హత్య కావిస్తే నోరెత్తి మాట్లాడరేం? మిసిసిపిలో వందలకొలది నీగ్రో కార్యకర్తలను క్రూరంగా హత్య కావి

(మిగతా 2 వ పేజీలో)

అవతార్ మెహెర్‌బాబా
లక్ష్మి, సరస్వతీపూజ అభివందన సమర్పణ

నేడు మా నూతన వస్త్ర ప్రారంభోత్సవ శుభ సందర్భమున మా వ్యాపారాభివృద్ధికితోడ్పడిన మా మిత్రులకు, ఖాతాదారులకు హృదయపూర్వక కృతజ్ఞతాభివందనముల నర్పించుచు వారి నిరంతర అభిమానములనుకోరుతున్నాము.

ఇట్లు,
మెహెర్ క్లాత్ షాప్,
(ప్రొప్రయిటర్సు : మాచేటి రామమోహనరావు అండ్ కో.,
(హైలాన్ సిల్కు, చేనేత, ఉన్ని, నూలు వస్త్రములు వగైరా వ్యాపారులు)
ఏలూరు రోడ్ : గవర్నరుపేట : విజయవాడ-2. : ఫోన్ : 1184

విశాలాంధ్ర

ఆఫ్రికాదేశాల ఆగ్రహం

కాంగోలో అమెరికా, బెల్జియమ్‌లు శ్వేతజాతీయుల రక్షణ పేరుతో సాగించిన హత్యాకాండకు ఆగ్రహపరవశుడు కాని స్వాతంత్ర్య ప్రియుడెవడూ ఉండడు. భద్రతా సంఘంలో ఈ సమస్య చర్చకువచ్చినపుడు ఆఫ్రికా దేశాలు ఆగ్రహావేశాలు ప్రదర్శించాయంటే అందులో ఆశ్చర్యం ఏమీలేదు. శ్వేతజాతీయుల రక్షణ పేరిట స్వాతంత్ర్యప్రియులైన కాంగో ప్రజలను మూకుమ్మడిగా హత్య కావించిన పాశ్చాత్య దేశాల చర్యలు, సామ్రాజ్యవాద దేశాల జాత్యహంకారాన్ని తెలియ చేస్తున్నాయి. చింత చచ్చినా పులుసు చావలేదన్నట్లు, అవసానదశలోనున్న సామ్రాజ్యవాదులు తిరిగి సామ్రాజ్యవాదాన్ని నెలకొల్పుకోవాలని చేస్తున్న వ్యర్థప్రయత్నాలకు కాంగో చక్కని ఉదాహరణ.

ఐతే, నేడు ప్రపంచ స్థితి మారిపోయింది ఈనాడు సామ్రాజ్యవాదులు ఎంతటి మారణ కాండను తలపెట్టుతున్నా పైచేయి వాళ్లది కాదు.

వలసదేశాలు స్వాతంత్ర్యాన్ని గుంజుకొంటున్నాయి పరాధీన దేశాలు స్వతంత్ర పంథాను అడుగిడినాయి. ఆఫ్రికా, ఆసియా దేశాలు మేల్కొన్నాయి సామ్రాజ్యవాద తుది అవశేషాలపై దెబ్బకొడుతున్న ఈ దేశాలకు సోషలిస్టు ప్రపంచం అండదండ లున్నాయి.

అందుచేతనే సామ్రాజ్యవాదుల హింసాకాండకు గురియైన స్వాతంత్ర్య కాముక ప్రజలు కొందరు తాత్కాలికంగా బలికావచ్చుగాక, బాధకష్టాలు కొంతకాలం ఇనుమడించవచ్చుగాక, వారుచేయవలసిన త్యాగాలు ఈదశలో ఎక్కువ కావచ్చుగాక - కాని తమ భవిష్యత్తును రూపొందించుకొనుటలో వారికి ఏ శక్తీ అడ్డుపడజాలదు తుది విజయం తమదేనన్న ఆత్మ విశ్వాసంతో ఈ ప్రజలు మహోన్నత సాహసాన్ని ప్రదర్శించి, త్యాగాలొనరించి స్వాతంత్ర్య పథాన పురోగమిస్తున్నారు.

కాలచక్రాన్ని వెనక్కి త్రిప్పగలమనే వెర్రిభ్రమలు సామ్రాజ్యవాదులు ఎంత త్వరగా వదులుకొంటే అంత మంచిది.

కాంగోలో అమెరికా, బెల్జియమ్‌ల ఘాతుక కృత్యాలుచూస్తూ ఊరుకొన్న భద్రతాసంఘం, "అభద్రతాసంఘం" అని ఒక ఆఫ్రికా నాయకుడు అన్నాడంటే అందులో తప్పేమీలేదు కాంగోలో శ్వేతజాతులు చనిపోయిన ఘటనలు గురించి.గోరింతలు కొండంతలుగా తెల్లజాతి పత్రికా విలేకరులు వర్ణిస్తున్నారు కానిఅక్కడ హత్యాకాండకు గురియైన నీగ్రోల విషయం ఎవరూ బయటపెట్టలేదు. ఘనా విదేశాంగమంత్రి అన్నట్లు కాంగోలో ఒక శ్వేతజాతీయుని ప్రాణం వేయిమంది రంగు జాతులవారి ప్రాణంతో సమానమైయింది

కాంగోలో జోక్యానికి సామ్రాజ్యవాదులతొత్తు షోంబే చెప్పేకారణాలు గాని సామ్రాజ్యవాదుల నిరర్థక ఆత్మసమర్థన కాని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోదగినవి కావు.

కాంగోలో స్వాతంత్ర్య పోరాటానికి ఆఫ్రికా రాజ్యాలుగాని, సోషలిస్టు ప్రపంచంగాని సహాయం చేయడం తప్పైతే.క్యూబాలో తైవాన్‌లో, దక్షిణకొరియా, వియత్‌నామ్, దక్షిణ అమెరికా దేశాలలో విప్లవ విద్రోహులకు సామ్రాజ్యవాదులు చేస్తున్న 'సహాయం' మాటేమిటి? నిజానికి ఈ దేశాలలోని పాలకులు వారికీలుబొమ్మలు. సామ్రాజ్యవాదుల సాయుధ జోక్యమే లేకుంటే వారెన్నడో ఉఫ్‌మంటేఎగిరిపోయేవారు.

ఇటీవల కాంగోలో స్వాతంత్ర్య ఉద్యమం ప్రజ్వరిల్లింది. జూలైలో అదౌలా ప్రభుత్వం పడిపోయింది లుముంబానుహత్యగావించినషోంబేను సామ్రాజ్యవాదులు అధికారంలోకి తెచ్చారు.

ఈనాడు కాంగోలో స్వాతంత్ర్య యుద్ధం సాగిస్తున్న విప్లవశక్తులకు ఇతరుల సహాయం పనికిరాదనే ప్రబుద్ధులు ఒకసారి తమ గత కళంక చరిత్రను స్మరించుకొంటే మంచిది.

లుముంబా అధికారంలో ఉండగా, బెల్జియం సేనల ప్రోత్సాహంతో కటంగా రాష్ట్రాన్ని స్వతంత్ర రాష్ట్రంగా షోంబే ప్రకటించాడు. ఆనాడు సామ్రాజ్యవాదులు అతనిని బలపరచారు అలాంటిజోక్యానికి అవకాశం ఉన్నదనే వారి వాదననే తీసుకొంటే, ఈనాడు కాంగోలోని విప్లవ శక్తులను ఆదుకోవడం ఏమాత్రం నేరం కాదు.

బెల్జియం, అమెరికాలు కాంగోలో సాయుధ దురాక్రమణ చేయడమే గాదు. విద్రోహ క్యూబా వైమానికులను పశ్చిమజర్మనీ, పోర్చుగల్, దక్షిణాఫ్రికా శ్వేతజాతులవారిని ఉపయోగిస్తున్నారు "లేబరు ప్రభుత్వం" అని చెప్పుకునే బ్రిటిష్ ప్రభుత్వం అమెరికా, బెల్జియంల చర్యకు ఆమోదం తెలియచేస్తున్నది.

అల్జీరియా ప్రతినిధి భద్రతా సంఘంలో అన్నట్లు "1956 లో సూయెజ్, ఈనాడు కాంగో" సామ్రాజ్యవాద దుష్ట పన్నాగాలకు తార్కాణాలు.

కాంగో సమస్య పూర్తిగా ఆఫ్రికా ప్రజల సమస్య దానిని పరిష్కరించవలసింది ఆదేశప్రజలే కాంగో సమస్యను ఆఫ్రికా ఐక్యతా సంస్థ పరిష్కరించనున్న సమయంలో అమెరికా, బెల్జియమ్‌ల దురాక్రమణ జరిగింది. దీనిని ఏ స్వాతంత్ర్య ప్రియుడూ సహించడు భారత ప్రభుత్వం నిర్ద్వంద్వంగా సామ్రాజ్యవాదుల చర్యలను ఖండించాలి

"సామ్రాజ్యవాదులారా, కాంగో నుండి వైదొలగండి" అనేది నేడు ఆఫ్రికా ప్రజావాణి అంతేగాదు స్వాతంత్ర్య పరిరక్షణకు వారికండగా నిలిచే ఆసియా, ఆఫ్రికా, యావత్ప్రపంచ స్వాతంత్ర్య కాముక ప్రజల వాణి కూడా అదే

డిసెంబరు 15న పొట్టి శ్రీరాములు సంస్మరణ

ముఖ్యమంత్రి విజ్ఞప్తి

హైదరాబాద్, డిసెంబరు 10

ఆంధ్రరాష్ట్ర సాధనకోసం 48 దినాలు నిరాహారదీక్ష జరిపి అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములుగారి సంస్మరణార్థం ప్రతిసంవత్సరం డిసెంబరు 15వ తేదీఉదయం 11 గంటలకు రాష్ట్ర ప్రజలందరూ రెండు నిమిషాలు మౌనం పాటించవలసిందిగా ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి నేడు విజ్ఞప్తి చేశారు.

పొట్టిశ్రీరాములు మహాత్మా గాంధికి నమ్మకమయిన అనుచరుడని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

1930 లో మహాత్మగాంధి ఆహ్వానంపై సబర్మతి ఆశ్రమంలో ప్రవేశించిన తదాది ఆయన మరణించే వరకూ కూడా తన యావచ్ఛక్తిని దేశ స్వాతంత్ర్య సాధనకోసం పునర్నిర్మాణ కోసం అంకితం చేశారు.

సమాజసేవ, సంస్కరణ, విషయంలో ఆయన జీవితం అందరికి ఆదర్శ ప్రాయమైనదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

దేశమంతటా త్వరలో కరెస్పాండెన్సు కోర్సులు

లోక్‌సభలో విద్యామంత్రి శ్రీ చాగ్లా వెల్లడి

న్యూఢిల్లీ డిసెంబరు 9

దేశంలో ఉన్నత విద్యపట్ల ఆసక్తి పెరుగుతున్న దృష్ట్యా అధ్యయనశాలలో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా విద్యాబోధన జరిపే పద్ధతిని దేశమంతటా ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నదని కేంద్ర విద్యామంత్రి శ్రీ యం సి చాగ్లా నిన్న లోక్‌సభలో వెల్లడించారు.

విశ్వవిద్యాలయ గ్రాంట్సు కమిషన్ నివేదికను సభలో చర్చకు పెడుతూ ఆయన ఈ విషయం చెప్పారు.

విశ్వవిద్యాలయాలలో రద్దీని తగ్గించేటందుకు వివిధ కళాశాలల్లో పార్ట్‌టైమ్ బోధన కూడా యేర్పాటు చేసే యోచన వుందన్నారు.

గ్రాంట్సు కమిషను సిఫార్సు చేసిన వేతనాల స్కేళ్లను యిప్పటికి 13 విశ్వ విద్యాలయాలు మాత్రమే అమలు జరుపుతున్నవి. స్వరాష్ట్రాల వెలుపల విశ్వవిద్యాలయాల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులు ఒక వంద మందికి స్కాలర్‌షిప్పులివ్వాలని ప్రభుత్వం నిశ్చయించింది. అని ఆయన చెప్పారు.

రిపబ్లిక్‌గా కీన్యా అవతరణ

నైరోబీ, డిసెంబరు 10

కీన్యా రేపు అర్ధరాత్రిసమయాన రిపబ్లిక్‌గా అవతరించబోతున్నది. ఆఖరి బ్రిటిషు సైనికులు నేడు కీన్యా నుంచి నిష్క్రమించడంతో, 70 సంవత్సరాలనుంచి సాగుతున్న బ్రిటిషు వలస పాలన పూర్తిగా అంతమైపోయింది.

అత్యుత్సాహవాతావరణంలో జరిగిన రాజస్థాన్ పార్టీ మహాసభ

రాజస్థాన్ రాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ మహాసభ అల్వార్‌వద్ద అత్యుత్సాహ వాతావరణంలో ముగిసింది అల్వార్‌వద్దనే సెప్టెంబరు మాసంలో పోటీపార్టీవారు తమ రాష్ట్ర పార్టీ మహాసభను జరుపుకున్నారు. కమ్యూనిస్టుపార్టీ మహాసభ నవంబరు 26 నుండి 29 వరకు జయప్రదంగా జరిగింది.

రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుండి 130 మంది ప్రతినిధులుమహాసభకు హాజరయ్యారు. పార్టీ చీలికముందు కమ్యూనిస్టు పార్టీలో వున్న ప్రముఖ నాయకులు, అత్యధిక పార్టీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, కమ్యూనిస్టుపార్టీనే బలపరచుతున్నట్లు మహాసభ స్పష్టంగా ఋజువుచేసింది. మహాసభలో నిర్మాణ నివేదిక, అర్హతల కమిటీ నివేదిక పెట్టినపుడు ఈ విషయాలు వెల్లడయినాయి. ఈ నివేదికలవల్ల, ఆయాజిల్లాల ప్రతినిధుల రిపోర్టులవల్ల పోటీపార్టీ వారి బలం రాష్ట్రంలో 25 శాతం అని స్పష్టమైంది. 1962 సంవత్సరంలో పార్టీసభ్యులుగావున్న 1700 మందిలోను 1500 మంది కమ్యూనిస్టుపార్టీతో వుంటూ, సభ్యత్వాన్ని పునరుద్ధరించుకున్నారు కేండిడేట్స్ సభ్యులుగావుండి, పార్టీసభ్యత్వం పొందినవారితోనూ, ఇటీవల క్రొత్తగా పార్టీ సభ్యత్వం పొందినవారితోనూ కలిసి మొత్తం 2 వేల మందిపార్టీసభ్యులురాష్ట్రంలో ఇప్పుడువున్నారు. పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోని వారందరూ పోటీ పార్టీలో చేరలేదు. ఉదాహరణకు సికార్, ఝుంఝును, పాలి ప్రాంతాలలో పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోని పార్టీ కార్యకర్తలు పెక్కుమంది కమ్యూనిస్టు పార్టీతోనే వున్నారు ఈ జిల్లాలలో జిల్లాకమిటీలు నిర్మాణ. కానప్పటికీ కమ్యూనిస్టు పార్టీతో పెక్కుమంది సభ్యులు ఉన్నారు

మహాసభకు హాజరైన ప్రతినిధుల ప్రసంగాలవల్ల కమ్యూనిస్టుపార్టీని రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు వ్యాపింపజేసి అన్ని జిల్లాలలోనూ నిర్మాణయుతమైన జిల్లాకమిటీలను ఏర్పాటు చేయాలనే కోరిక వ్యక్తమైంది.

మహాసభ కార్యక్రమంలో ఎక్కువకాలం పార్టీ ముసాయిదాపై చర్చకే వినియోగింపబడింది పార్టీకోసం, ప్రజాఉద్యమాలకోసం అశేషత్యాగాలు కావించిన పార్టీ కార్యకర్తలు మహాసభకు ప్రతినిధులుగా వచ్చారు. ప్రజాసేవలో పెక్కుసార్లు జైళ్ళకు వెళ్ళినవారు 49 శాతం వరకు వున్నారు. ఒకసారి జైలుకెళ్ళినవారు 60 శాతం వరకు ఉన్నారు. ప్రతినిధులలో 90 శాతం వరకు సత్యాగ్రహంలో పాల్గొన్నవారే.

ప్రస్తుత పార్టీ ముసాయిదా కార్యక్రమం చరిత్రాత్మకమైనదని, ప్రతినిధులు తమ ప్రసంగాలలో పేర్కొన్నారు. చర్చలలో దాదాపు 40 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. దీర్ఘచర్చ అనంతరం ముసాయిదాకు కొన్ని నిర్దిష్ట సవరణలను మహాసభ ఆమోదించింది.

ముసాయిదాలోని విప్లవదశ, వర్గస్వభావం, జాతీయ ప్రజాస్వామ్య సంఘటన మొదలైన అంశాలకు చెందిన భాగాలకు ప్రతినిధులు తమ ఆమోదాన్ని ప్రకటించారు.

శ్రీ హెచ్.కె.వ్యాస్ కాక 8 మంది భారత కమ్యూనిస్టుపార్టీ మహాసభకు ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. 19 మంది సభ్యులతో రాష్ట్ర కార్యవర్గం, 7 గురు సభ్యులతో కార్యదర్శివర్గం ఎన్నుకోబడింది. శ్రీ హెచ్. కె. వ్యాస్ రాష్ట్రపార్టీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

శ్రీయుతులు రామానంద్, స్వామి జీ, హండా ఎ. విశ్వనాథ్, శాంతిశంకర్ శుక్లా, కేశిమాల్ హెచ్ కె వ్యాస్‌లు కార్యదర్శి వర్గంగా ఎన్నుకోబడ్డారు.

పిడివాదుల మాటలు, కాంగ్రెస్ ఆశలు భ్రమలని రుజువు చేసిన రాష్ట్రపార్టీ మహాసభ

హైదరాబాద్ సమితి సమావేశంలో గౌడ్ నివేదిక

హైదరాబాద్, డిసెంబరు 11

పిడివాదుల మాటలు, అలాగే కాంగ్రెసువాదుల ఆశలు నిజంకావని, అవి భ్రమలని, గుంటూరులోజరిగిన రాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ 10 వ మహాసభ రుజువు చేసిందని హైదరాబాద్ నగర కమ్యూనిస్టు సమితి సమావేశంలో రాష్ట్ర మహాసభపై నివేదిక యిస్తూ నగరసమితి కార్యదర్శి శ్రీ రాజబహదూర్‌గౌడ్ తెలిపారు.

వివిధశాఖా కార్యదర్శులుకూడా హాజరయిన ఈ సమావేశానికి శ్రీ వై. వి. రావు అధ్యక్షత వహించారు.

మహాసభ సందర్భంలో అరుణపతాకాన్ని ఆవిష్కరించినప్పుడు కొబ్బరికాయ కొట్టిన విషయమై వచ్చిన విమర్శను గురించి ఆయన కొంతవరకు వివరిస్తూ ఈ విషయమై పార్టీ కార్యాలయానికి అనేక లేఖలు వచ్చాయన్నారు.

మతవాదరహిత పార్టీకి దేనిపైనయినా, ముఖ్యంగా కమ్యూనిస్టుపార్టీపై అటువంటి విమర్శరావటంలో ఆశ్చర్యంలేదనీ, అలా రావటం సమంజసమని అన్నారు. అయితే కొబ్బరికాయ కొట్టడం అనేది నిర్ణయించుకున్న కార్యక్రమంలో ఒకఅంశముకాదు. చేయాలని చేసిన పనికాదు, అని చెప్పారు. కమ్యూనిస్టుపార్టీని అభిమానించి, అనుసరించే కొంతమంది కార్యకర్తలు, అరుణ పతాకంపట్ల తమకున్న ప్రేమాభిమానాలకు చిహ్నంగా కొబ్బరికాయ తెచ్చారు.

పతాకాన్ని ఆవిష్కరించిన నాయకుని చేతికి వారు దానిని అందించారు, ఆదశలో అక్కడ తిరస్కరించటం భావ్యం కాదని కొబ్బరికాయను కొట్టడం జరిగిందని డాక్టర్ గౌడ్ తెలిపారు.

పార్టీనుండి విడిపోయిన పిడివాదుల బలం అతి స్వల్పమని గుంటూరు మహాసభ రుజువు చేసిందన్నారు. మనపార్టీ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రధానమయిన ప్రతిపక్షంగా వర్ధిల్లగలదని ఆయన చెప్పారు.

మహాసభకు హాజరయిన 594 గురు ప్రతినిధులలో 307 మంది కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేద రైతాంగం నుండి వచ్చిన వారన్నారు, ఇది మన పార్టీకి కార్మికవర్గంతో, పేద రైతాంగంతోవున్న సంబంధాలకు గీటురాయి అని ఆయన చెప్పారు.

316 మంది ప్రతినిధుల వయస్సు 30-40 సంవత్సరాలని, పార్టీలోవున్న యువ రక్తానికిది తార్కాణమని అన్నారు.

252 మంది ప్రతినిధులు 1933-52 మధ్య పార్టీలో చేరారని ఇది ప్రజాపోరాటాలలో మనకున్న అనుభవాన్ని సూచించుతున్నదన్నారు.

405 మంది ప్రతినిధులు తాలూకా, జిల్లా కౌన్సిళ్ళలో సభ్యులుగా వున్నారని ఇది వారి రాజకీయస్థాయికి నిదర్శనంగా చూడవచ్చునని చెప్పారు.

ప్రతినిధుల మొత్తం జైలు జీవితం 374 సంవత్సరాలున్నదనంటే, అది మనపార్టీ కార్యకర్తల ఆత్మస్థయిర్యానికి, త్యాగనిరతికి తార్కాణంగా భావించాలన్నారు.

పార్టీ విచ్ఛిన్నకులకు వ్యతిరేకంగానూ, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగానూ జరిపిన పోరాట అనుభవంతో 10 వ మహాసభకు ప్రతినిధులు వచ్చారన్నారు.

1955 ఎన్నికల తర్వాత పార్టీలో ఏర్పడిన నిరుత్సాహపూరిత వాతావరణం తర్వాత ప్రజాప్రయోజనాల రక్షణకు దేశవ్యాపితంగా, రాష్ట్రవ్యాపితంగా పోరాటాలు జరపడం ఇదే మొదటిసారి అనీ ఈ పోరాటంద్వారా సాధించిన అనుభవం, ఉత్సాహం, విశ్వాసాలతో ప్రతినిధులు మహాసభ చర్చలలో పాల్గొన్నారని శ్రీ గౌడ్ చెప్పారు

ఇదివరకు వెళ్ళని కొన్ని గ్రామాలకు, ప్రాంతాలకు ఈ ఆందోళన సందర్భంలో మన కార్యకర్తలు వెళ్ళారు ఎన్నడూ ప్రజా పోరాటాలలోకి రాని మరికొందరిని ఈసారి రంగంలోకి తీసుకువచ్చారు.

ప్రజా పోరాటంద్వారా, ఇంకా ఎక్కువ మందిని పార్టీ వైపుకు ఆకర్షించగలమనే గట్టి విశ్వాసం మహాసభ ప్రతినిధులలో స్పష్టంగా కనుపించింది. గత దశాబ్దకాలంలో పార్టీలో వచ్చిన పెడధోరణులను వివరించి. తొలగించుకోవడానికి ఉద్యమం నడపాలని మహాసభ నిర్ణయించింది.

పోటీపార్టీలోకి వెళ్ళిన అనేకమంది తిరిగి మన పార్టీ పరిధిలోకి రావడాన్ని మహాసభ గమనించింది. అలా వచ్చినవారిలో కొందరు గుంటూరు మహాసభలో వున్నారు. పోటీపార్టీలో వున్న "విప్లవ స్వభావం" "విప్లవకర సోమరితనం"మాత్రమేనని అనుభవం ఋజువుచేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ పురోగతిలో 10 వ మహాసభ ఒక మైలురాయి అని శ్రీ గౌడ్ అభివర్ణించారు.

రైల్వే స్టేషన్లలో కాంగ్రెస్ జండాలు

రాజ్యసభలో ప్రశ్నపరంపర: శ్రీ పాటిల్ కుంటి సమాధానం

న్యూఢిల్లీ, డిసెంబరు 10

గుంటూరు ఎ. ఐ. సి. సి. అయిపోయిన కొన్ని రోజులవరకుకూడా విజయవాడ, తెనాలి రైల్వేస్టేషన్లలో కాంగ్రెస్ జండాలు అట్టే ఉంచలేదా? అని శ్రీ మరియస్వామి అడిగిన ప్రశ్నకు రైల్వేమంత్రి శ్రీ ఎస్. కె. పాటిల్ నేడు రాజ్యసభలో కర్రవిరగకుండా పాము చావకుండా సమాధానం యిచ్చారు.

రైల్వేలు రాజకీయపార్టీల జండాలను రైల్వే ఆవరణలలో పాతడానికి అనుమతించవని ఆయన అన్నారు.

గుంటూరు ఎ. ఐ. సి. సి. సందర్భంలో కాంగ్రెస్ జండాలను ఎత్తడమేగాక విజయవాడ స్టేషన్‌లో ఆహ్వాన సంఘ కార్యాలయాన్ని కూడా తెరచిన విషయం విదితమే.

విజయవాడ, తెనాలి స్టేషన్ల ఆవరణల్లో కాంగ్రెస్ జండాలను పాతిన విషయం యథార్థమోకాదో తనకు తెలియదని రైల్వే మంత్రి అన్నారు. ఈ ఫిర్యాదుగురించివిచారణ చేస్తామని అన్నారు. రాజకీయపార్టీల జండాలతో రైల్వేస్టేషన్లను అలంకరించడానికి అనుమతించబోమని ఆయన అన్నారు.

రైల్వే ప్లాట్ ఫారములపై రాజకీయ పార్టీల జండాలు, బేనర్లు, ఇతర పార్టీ చిహ్నాలు ప్రదర్శించడానికి అనుమతించరాదని. అయితే ఎన్నికలలో పోటీ చేసే పార్టీలు కొన్ని షరతులతో తమ అభ్యర్థుల పోస్టరులు పెట్టుకొనడానికి అనుమతించ వచ్చునని మంత్రి డాక్టర్ రామసుభగ్‌సింగ్ అన్నారు.

శ్రీ మరియస్వామి: గుంటూరు ఏ. ఐ. సి. సి. కిముందు, తరువాత కూడా రైల్వే ప్లాట్ ఫారములపై కాంగ్రెస్ జండాలు నెలకొల్పడానికి అనుమతి చడం ఏ విధంగా జరిగింది?

డాక్టర్ రామసుభగ్‌సింగ్: ఆ విషయం నాకు తెలియదు ఆయా పార్టీల నాయకులు వస్తే ఆ పార్టీల జండాలను స్టేషన్‌లోకి తీసుకురావడానికి ఎట్టి అభ్యంతరం లేదు. రైల్వేలు వ్యాపారసంస్థలు గనుక ఎక్కువ సంఖ్యలో టిక్కెట్లు కొనేవారికి ప్రత్యేకబుకింగ్ ఆఫీసులు తెరవడానికి అభ్యంతరం ఏమీ లేదన్నారు.

ప్రశ్న: ఇతర రాజకీయ పార్టీలకుకూడా ఇటువంటి అవకాశాలు కల్పిస్తారా?

సమాధానం, ఉన్నాయనేది స్పష్టం. ఎందుకంటె ఆ విషయమై ఎటువంటి ఫిర్యాదులు లేవు గనుక.

పాక్ నిరసన

భారత రాజ్యాంగ సూత్రాల్ని కాశ్మీర్‌కు వర్తింప జేస్తున్నందుకు

కరాచీ, డిసెంబరు 10

భారత రాజ్యాంగ చట్టంలోని 356 357, నిబంధనలను కాశ్మీర్‌కు వర్తింపచేస్తూ ఇటీవల పార్లమెంటు చేసిన నిర్ణయంపట్ల పాకిస్తాన్ ప్రభుత్వం తన నిరసన తెలిపింది పాకిస్తాన్‌లోని భారత హైకమిషనర్‌కు పాక్ విదేశాంగ శాఖవారు యీపత్రాన్ని అందజేశారు

కాంగోపై చర్చ

(1 వ పేజీ తరువాయి)

స్తుంటే ఎవ్వరూ పెదవి మెదపరేం? ఎదుకంటే ప్రాణాలు పోగొట్టుకొన్న నిర్భాగ్యులు రంగు వర్ణస్థులు గనుకనే?

మాలివిదేశాంగ మంత్రి యం. ఉస్మాన్‌బా ప్రసంగిస్తూ కాంగోలో తనచర్యలు న్యాయ సమ్మతమేనని అమెరికా ప్రకటించడం, గతంలో హిట్లర్ తన చర్యలను బలపరచుకుంటూచేసిన ప్రకటనలవలె ఉన్నాయని అన్నారు.

అల్జీరియా ప్రతినిధి ప్రసంగిస్తూ, అమెరికా స్వార్థపూరిత ప్రయోజనాలకు ఐరాస ఆయుధ కారాదని ఉద్ఘాటించారు.

కాంగో సమస్యకు ఆఫ్రికా సమైక్యతాసంస్థ చేసిన సిఫార్సులను ముగ్గురు ప్రతినిధులు బలపరుస్తూ ప్రసంగించారు.

ఇతరుల జోక్యం లేకుండా కాంగో సమస్యను ఆఫ్రికా సమైక్యతాసంస్థ పరిష్కరించాలనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు.

అమెరికా, బెల్జియమ్ దేశాల ప్రతినిధులు రేపటి సమావేశంలో ప్రసంగిస్తారు.

షోంబేరాకను నిరసిస్తూ రోమ్ ప్రజా ప్రదర్శన

రోమ్, డిసెంబరు 10

కాంగో సమస్యను భద్రతా సంఘం చర్చిస్తున్న కారణంగా షోంబే న్యూయార్కుకు వెళ్తూ నేడు రోమ్ నగరానికి వచ్చారు.

రోమ్ నగరంలో షోంబే రాకను నిరసిస్తూ పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి ఈప్రదర్శనల సందర్భంలో ఇటలీ పార్లమెంటు నేటి రాత్రి ఒక గంటసేపు గందరగోళంలో మునిగిపోయింది కమ్యూనిస్టు సభ్యులు 7 గురికి కొద్ది గాయాలు కూడా తగిలాయి తర్వాత పోలీసులు వచ్చి ప్రదర్శకులను అదుపులో పెట్టారు తర్వాత షోంబే పోప్ పాల్‌ను కలుసుకున్నారు.

విమానాశ్రయంలో పత్రికా విలేకరులతో ఇరుగు పొరుగు రాజ్యాలవల్ల కాంగోకు ప్రమాద మేర్పడిందని, ఆ రాజ్యాలు విప్లవ కారులకు ఆయుధ సహాయాన్ని అందజేస్తున్నాయని షోంబే అన్నారు

గతంలో అడ్డిస్ అబాబావద్ద జరిగిన ఆఫ్రికా సమైక్యతాసంస్థ విదేశాంగమంత్రుల సమావేశంలో సైనిక సహాయం కోరాననీ, అయితే, వారుసోదర ఆఫ్రికావాసుల రక్తాన్ని చిందించటం తమకు ఇష్టంలేదని తన అభ్యర్థనను త్రోసిపుచ్చారని షోంబే అన్నారు.

ఆ విధంగా తన అభ్యర్థనను త్రోసిపుచ్చిన అల్జీరియా, ఘనా, మాలి, ఐక్య అరబ్ రిపబ్లిక్‌లే నేడు విప్లవ కారులకు ఆయుధ సహాయాన్ని అందజేస్తున్నాయని షోంబే నిందారోపణ చేశారు

ఉమ్మడి అణ్వాస్త్ర పథకానికి బ్రిటన్ ప్రత్యామ్నాయం

విల్సన్ కామన్స్‌సభలో వెల్లడిస్తారట!

అట్టావా, డిసెంబరు 11

పోలారిస్ మిసైలు అమర్చిన 25 యుద్ధ నౌకలతో అమెరికా ప్రతిపాదిస్తున్న ఉత్తర అట్లాంటిక్ కూటమి ఉమ్మడి అణ్వస్త్ర బలగానికి తమ ప్రత్యామ్నాయ ప్రతిపాదన లేమో వెల్లడించటానికి నిన్నయిక్కడనుండి స్వదేశం బయలుదేరిన బ్రిటిష్ ప్రధాని వెల్లడించ నిరాకరించారు.

విల్సన్ రెండురోజులపాటు అమెరికా అధ్యక్షుడు జాన్సన్‌తోనూ, కెనడా ప్రధాని లెస్టర్ పియర్సన్‌తోనూయీ విషయంలోసమాలోచనలు జరిపారు.

అట్లాంటిక్ కూటమి రాజ్యాల అణ్వస్త్ర రక్షణ పథకంగురించి తన ప్రతిపాదనలనూ అమెరికా కెనడా నాయకులతో తన సంభాషణల వివరాలనూ కామన్సు సభలో మాత్రమే వెల్లడించగలనని ఆయన పత్రికల వారితో చెప్పారు.

ఈ సమస్యపై మిగతాకూటమి రాజ్యాలతో గూడా ఈ లోగా సమాలోచిస్తామనీ. అయితే ఫ్రాన్సు ఎలాంటి వైఖరి తీసుకుంటుందో తాను జోశ్యం చెప్పలేనన్నారు.

ప్రపంచంలో వస్తున్న పరిణామాలకు అనుగుణంగా అట్లాంటిక్ కూటమి వ్యవస్థ గూడా మారాలని ఆయన అన్నారు.

ప్రాచ్యపశ్చిమ సంబంధాల భవితవ్యం గురించి ఒక పాత్రికేయుడడిగిన ప్రశ్నకు జవాబుగా విల్సన్,యీవిషయంపై అప్పుడేఒక నిర్ధారణకు రావడానికి వీలేకుండా వుందన్నారు.

"క్రెమ్లిన్‌లో అచ్చితంగా ఏమిజరుగుతున్నదో చెప్పడం కష్టం అయితే, రష్యా నూతన ప్రధాని కొసిగిన్‌కూడా కృశ్చేవ్ విధానాలను అనుసరించే వ్యక్తే. కనుక పెద్ద మార్పేదో వుంటుందని భావించడానికి ఆస్కారం కన్పించదు అన్నారు.

అణ్వాస్త్ర వ్యాప్తి నివారణకు ఉమ్మడి చర్యలు

జాన్సన్‌తో సంభాషణలపై విల్సన్ వ్యాఖ్య

వాషింగ్‌టన్, డిసెంబర్ 10

చైనా అణ్వస్త్ర పరీక్ష జరిపినందువల్ల అణ్వస్త్ర వ్యాప్తి నివారణకు ఉమ్మడిగా కృషి చేయాల్సిన అవసరం మరింత పెరిగిందని బ్రిటిష్ ప్రధాని హెరాల్డ్ విల్సన్ నిన్న అట్టావా బయలుదేరబోయే ముందు ఇక్కడ జరిపిన ఒక పత్రికాగోష్ఠిలో చెప్పారు.

అణ్వాస్త్రాల వ్యాప్తిని నివారించేటందుకు అణ్వాయుధ దేశాలు నిర్వహించవలసిన బాధ్యతల గురించి తాను జాన్సన్‌తో చర్చించినట్లు ఆయన చెప్పారు.

"నాటో కూటమి రాజ్యాలకు సంబంధించిన మేరకు కొన్ని దిఙ్మాత్రమైన సూత్రాలను నిర్ణయించుకున్నాం. అణ్వస్త్ర వ్యాప్తి పట్ల అదుర్దా చెందుతున్న మా మిత్రరాజ్యాలకు గూడా యివి ఉపయుక్తంగా వుండగలవని భావిస్తున్నాము" అని ఆయన అన్నారు.

బోనస్ బిల్లు పరిశీలనకు త్రిపక్ష ఉపసంఘం

కార్మిక స్థాయీసంఘంచే యేర్పాట్లు

న్యూఢిల్లీ డిసెంబరు 10

పార్లమెంటుకు సమర్పించే బోనస్ బిల్లును సమీక్షించి, యజమానులకూ కార్మికులకూ ఆమోదయోగ్యమైన ఒక సూత్రాన్ని రూపొందించేకోసం కార్మిక స్థాయీసంఘం నేడొక త్రైపాక్షిక వుపసంఘాన్ని యేర్పాటు చేసింది

ఈ ఉపసంఘానికి కేంద్ర కార్మికమంత్రి అధ్యక్షుడుగా వుంటారు. కార్మికుల తరపున ఏ. ఐ. టి. యు. సి; ఐ. యన్. టి. యు సిల ప్రతినిధులుంటారు.

హింద్ మజ్దూర్ సభ ప్రతినిధులు యీ వుపసంఘంలో చేరడానికి నిరాకరించారు.

ఈ ఉపసంఘం సమర్పించే నివేదికను పార్లమెంటులో బిల్లు ప్రతిపాదించబడేలోగా మహోన్నత స్థాయీ సంఘందర్శిస్తుంది. ఈ నివేదిక ఒక నెల రోజుల్లోపుగా తయారు కావలసి వుంది

సమావేశానికి ముందు యజమానుల ప్రతినిధులకూ, కార్మిక ప్రతినిధులకూ మధ్య సంప్రతింపులు జరిగాయి అయితే వారు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు.

యజమానుల ప్రతినిధి శ్రీ నావెల్ టాటా అసలు బోనస్ సూత్రమనేదే 'ఊహాజనిత' మని వాదించారు.

కొత్త బోనసు సూత్రంవల్ల కార్మికులు ప్రస్తుతం పొందుతున్న సౌకర్యాలేవీ రద్దు కారాదంటూ ప్రభుత్వ బిలులోని అంశానికే ఆయన ఎసరు పెట్టారు. ముసాయిదా బిల్లులోని సూత్రంపై మధ్యేమార్గం యేర్పడాలంటే 'యథాపూర్వ సంప్రదాయాల' గురించి మాట్లాడం మానాలని ఆయన వాదించారు.

లాభం వచ్చినా, నష్టం వచ్చినా నాలుగు శాతం కనీసం బోనస్ యివ్వడానికి యజమానులు సుముఖంగానే వున్నట్లు ఆయన ధ్వనించారు.

నికరమైన మిగులు లేనందుకు, మొత్తం ఆర్జనలో నుండి ముందుగా తీయాల్సిన పద్దులగురించి కొంతమేరకు రాజీపడ్డానికి ఆయన సుముఖత చూపారు అయితే కార్మికులు పూర్వం తమకున్న సౌకర్యాలు యథాతథంగా వుండాలని పట్టుబట్టరాదని అన్నారు.

ఏ. ఐ టి. యు. సి ప్రతినిధి శ్రీ సతీష్ లూంబా కార్మికుల ప్రయోజనాల విషయంలో యెలాంటి రాజీ లేదని చెప్పారు. కమిషన్ సిఫార్సుచేసిన బోనస్ కనిష్ఠ,గరిష్ఠ ప్రమాణం తగ్గింపుకు సమ్మతించబోమన్నారు.

ఐ. యన్. టి. యు. సి. ప్రతినిధి శ్రీ జి రామానుజం కార్మికులకు ప్రస్తుతం వున్న సౌకర్యాలు కుదించరాదన్నారు. లాభాల్లో కార్మికులకు వాటా వుందనే సూత్రాన్ని ఆమోదించినప్పుడు కంపెనీ లాభనష్టాల బ్యాలెన్సుషీట్ల గురించిన సమాచారం తెలుసుకునే హక్కు వారికి విధిగా వుండాలన్నారు,

శ్రీ టాటా, కార్మికమంత్రి చాలా 'అనుచితం'గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. "బోనస్ అనేది సౌహార్దతకు సూచనగాకుండా పీడన క్రింద పరిణమించింద'ని అన్నారు.

చర్చల అనంతరం ఉపసంఘం నియమించాలనే ప్రతిపాదను ఐ. యన్. టి. యు. సి. అధ్యక్షుడు శ్రీ కాశీనాథ్‌పాండే చేశారు అస్సాం కార్మికమంత్రి శ్రీ కె. పి. త్రిపాఠీ ఆ ప్రతిపాదనను బలపరిచారు

మహారాష్ట్ర కార్మికమంత్రి శ్రీ తిడ్కే యీ సమస్య సత్వర పరిష్కారం అవసరమనీ, ఉపసంఘంచేసే నిర్ణయాన్ని చట్టం వచ్చేదాక వేచి వుండకుండా ఆర్డినెన్సు ద్వారా అమలు జరపాలని సూచించారు

యు టి. యు. సి ప్రతినిధి శ్రీ శ్రీకంఠన్ నాయర్ ఉపసంఘం అవసరంలేదనీ, యీ బిలును సరాసరి పార్లమెంటులోనే చర్చిస్తే సరిపోతుందన్నారు

హింద్‌మజ్దూర్ సభ ప్రతినిధి శ్రీ హెచ్. య. కొర్వార్ ఉపసంఘ నియామకాన్ని వ్యతిరేకించారు. ఆ ఉప సంఘంలో చేరడానికి నిశ్చయించినందుకు ఏ. ఐ. టి. యు. సి. ని విమర్శించాడు.

బోనస్ కమిషన్ నివేదికపై చర్చ: జరపాలని లోక్‌సభలో డిమాండు

న్యూఢిల్లీ. డిసెంబరు 11

పార్లమెంటు ప్రస్తుత సమావేశంలోనే బోనస్ కమిషన్‌పై నివేదికను చర్చించాలని శ్రీ ఆనందన్ నంబియార్ నేడు లోక్‌సభలో కోరారు.

నిన్న జరిగిన త్రైపాక్షిక స్థాయీ సంఘ సమావేశంలో ఈ ప్రసక్తి వచ్చిందనీ, నివేదికపై చర్చ ఇప్పటికే చాలాఆలస్యం అయిపోయిందనీ శ్రీ నంబియార్ విమర్శించారు.

జాతీయ ట్రేడ్‌యూనియన్ నాయకుడు, కాంగ్రెస్ సభ్యుడుఅయిన శ్రీ కాశీనాథ్ పాండే బోనస్‌కమిషన్ నివేదికపై ఇప్పుడు చర్చించితే పరిస్థితి మరింత క్లిష్టంగా తయారుకాగలదని అందుచేత యిప్పుడు ఈ సమస్యపై చర్చించరాదని అభ్యంతరం తెలిపారు.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ సత్యనారాయణ సిన్హా తాను మంత్రితో సంప్రతించి చర్చ సాధ్యమో కాదో తెలుపగలనని అన్నారు.

శ్రీ హేమ్ బారువా (ఎస్. ఎస్. పి) నాగభూమి శాంతి సంభాషణల గురించి ప్రస్తుత సమావేశంలోనే పరిశీలించాలన్న తన ప్రతిపాదనను చర్చించడానికి కొంతకాలాన్ని కేటాయించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం

హైదరాబాద్, డిసెంబరు 12

ప్రదేశ్ కమ్యూనిస్టుసమితి కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీ వై. వి. కృష్ణారావు గారు ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గసమావేశం డిసెంబరు 25నుండి 28 వరకు హైదరాబాద్‌లో జరుగుతుంది సమావేశం 25 మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుంది. అందరూ తప్పక హాజరు కాగోరుచున్నాము.

ఎజెండా:

1. సభ్యత్వ కాంపెయిన్ సమీక్ష.
2. పార్టీఫండు వసూళ్లు,
3 సబ్‌కమిటీల నిర్వాహణ,
4. పని విభజన
5. మహాసభ రిపోర్టు.

శ్రీ జి. కుమారస్వామి మృతికి రాష్ట్ర శాసనసభ సంతాపం

హైదరాబాద్, డిసెంబరు 10

ఉమ్మడి మద్రాసు రాష్ట్రశాసనసభ సభ్యులుగా వుండిన జి కుమారస్వామి మృతికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ నేడు తన సంతాపాన్ని వ్యక్తం జేసింది.

సభ్యులు రెండు నిముషాలు నిలబడి మౌనం వహించారు.

ఫ్రెంచి ఆయుధ బడ్జెట్‌కి సెనేట్ నిరాకరణ

పారిస్, డిసెంబరు 10

సైనిక సామగ్రి కోసం వచ్చే ఆరేళ్లలో 5480 కోట్ల ఎనభై లక్షల ఫ్రాంకులు, ఖర్చుపెట్టేటందుకు ఫ్రెంచి ప్రభుత్వం తయారు చేసిన బిల్లుని ఫ్రెంచి సెనేట్ (ఎగువ శాసనసభ) నేడు తృణీకరించింది దీనికి అనుకూలంగా 40 ఓట్లు రాగా వ్యతిరేకంగా 178 ఓట్లువచ్చాయి ఈ మొత్తంలో సగభాగం అణ్వాయుధాలకింద ఖర్చు చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం.

ఈ బిల్లును ఫ్రెంచి శాసనసభ గురువారం నాడు ఆమోదించింది.

కంటింజెన్సీ ఫండ్ పెంచుతూ శాసనసభచే బిల్లు: ఆమోదం

హైదరాబాద్, డిసెంబరు

ఆంధ్రప్రదేశ్ కంటింజెన్సీఫండ్‌ను 3 కోట్ల నుండి 5 కోట్ల వరకు పెంచుతూ రాష్ట్ర శాసనసభ నేడొక బిల్లును ఆమోదించింది.

ప్రస్తుతమున్న 3 కోట్ల నిధులు పెరుగుతున్న వివిధ శాఖల అవసరాలను తీర్చడానికి చాలటంలేదని, అభివృద్ధి పథకాలవంటి విషయంలో అనుకోకుండా పెరిగే ఖర్చునుకూడా తీర్చాలంటే ఈనిధిని పెంచాలని ఆర్థికమంత్రి చెన్నారెడ్డి ఈ బిల్లును ప్రతిపాదిస్తూ అన్నారు.

కొద్దిపాటి చర్చల తర్వాత సభవారు బిల్లును ఆమోదించారు

సిమెంటు కోటాలో ఆంధ్రకు అన్యాయం

హైదరాబాద్, డిసెంబరు 11

రైల్వే రవాణాలో ఎదురవుతున్న ఇబ్బందులవల్ల ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం కేటాయించిన సిమెంటు కోటాను ప్రభుత్వశాఖలు పూర్తిగా తెచ్చుకోలేకపోతున్నాయని నేడుదయం ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్థికమంత్రి చెన్నారెడ్డి శాసనసభలో చెప్పారు.

ఫ్యాక్టరీల నుండి రోడ్డు ద్వారా సిమెంటును తెచ్చుకోమని ప్రభుత్వ శాఖలకు సూచనలు యిచ్చామన్నారు

ప్రతి మూడు మాసాలకు మనరాష్ట్రానికి సాధారణంగా 1. 5 లక్షల టన్నుల సిమెంటు అవసరమని అన్నారు. ప్రభుత్వగృహనిర్మాణ కార్యక్రమాలకు ఏటా 8, 200 టన్నులు కావలసి వుంటుందన్నారు.

మూడు మాసాలకు 1 లక్ష 25 వేలటన్నులు అవసరముండగా కేంద్రం 89, 800 టన్నులు కేటాయిస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం పదేపదే కోరగా 1964 వ సంవత్సరంలో మొదటి 9మాసాలలోమరో 14 400 టన్నులు యిచ్చిందన్నారు.

విదేశాల నుండి సిమెంటును ప్రభుత్వం దిగుమతి చేసుకుంటుందా అని అడిగినప్రశ్నకు అది కేంద్ర ప్రభుత్వం నిర్ణయించవలసిన అంశం అని అన్నారు

రాష్ట్రంలో 2¼ లక్షల ఎకరాల భూదానం

హైదరాబాద్, డిసెంబరు 11

భూదానయజ్ఞానికిఆంధ్రప్రదేశ్‌లో 16 629 మంది దాతలు 2,41,952 ఎకరాల భూమిని దానం చేశారని ఇందులో సుమారు లక్ష ఎకరాలను 31,041 కుటుంబాలకు పంచారని రెవిన్యూ మంత్రి శ్రీ యన్. రామచంద్రారెడ్డి నిన్న రాష్ట్ర శాసనసభలో చెప్పారు.

సమితుల్లో పెద్దఎత్తున జీపుల దుర్వినియోగం

శాసనసభలో సభ్యుల ప్రశ్నల వర్షం

హైదరాబాద్, డిసెంబరు 10

పంచాయతీ సమితులలోను, బ్లాకులలోను జీపులను దుర్వినియోగ పరుస్తున్న విషయంపై నేడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు ప్రభుత్వాన్ని నిగ్గదీశారు దాదాపు రెండుగంటల సేపు ఈ విషయమై తర్జన భర్జనలు సాగాయి

కమ్యూనిస్టు సభ్యులు శ్రీయుతులు అత్తులూరి సర్వేశ్వరరావు, వంకా సత్యనారాయణ పంచాయతీ సమితి బ్లాకులలో జీపుల దుర్వినియోగంపై ప్రశ్నించారు. పంచాయతీ రాజ్ మంత్రి శ్రీ లక్ష్మీనరసయ్య యీ ప్రశ్నలకు సమాధానమిస్తూ పశ్చిమ గోదావరి జిలాలోని 25 బ్లాకులలో జీపులు త్రాగిన పెట్రోలుకు అయిన వ్యయాన్ని గురించి ప్రకటించారు.

కొన్ని బ్లాకులలో జీపుల పెట్రోలువ్యయం ఒకటి రెండువేల రూపాయలు మాత్రమే కాగా ఆకివీడు బ్లాక్ గత ఏడాది 7495 రూపాయలు ఎందుకు ఖర్చు చేయవలసి వచ్చిందని మరొక సభ్యుడు ప్రశ్నించారు.

ఆ బ్లాక్ లో భారీ పనులు తలపెట్టిన కారణంగా పెట్రోలు ఖర్చు కూడా భారీగా అయివుండ వచ్చునని మంత్రి సమాధానం చెప్పారు.

స్పీకరు: అంటే పెట్రోలు ఎంత ఎక్కువ ఖర్చు అయితే అంత భారీగా పనులు జరిగినట్లు అర్థం అని చమత్కరించారు. దీనికి సభ్యులు విరగబడి నవ్వారు.

జీపుల దుర్వినియోగంపై సభ్యులు అనుబంధ ప్రశ్నలవర్షం కురిపించారు. వీటికి మంత్రి సమాధానం ఇస్తూ, జీపుల వాడకంపై నిర్బంధాలు విధించి, పెట్రోలు వాడకం తగ్గించవలసిందిగా అన్ని బ్లాకులనూ ప్రభుత్వ ఆదేశించిందన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ జీపులను ఉపసంహరించడం జరగదనీ, వాటి వాడకంపై మాత్రమే ఆ ఆంక్షలు విధిస్తామనీ మంత్రి చెప్పారు. సరియైన రోడ్లులేని వెనుకబడిన ప్రాంతాలలో జీపులసంఖ్య హెచ్చించదమన్నట్లు కూడా తెలిపారు.

శ్రీ టి.వి.ఆర్. శర్మ: కేవలం పెట్రోలు క్రిందనే లక్షల రూపాయలు వ్యయం చేయబడుతున్నది. జీపుల మరమ్మతులు, తదితర పనులకు కూడా కొంత ఖర్చు వుంటుంది. అలాంటప్పుడు జీపులను దుర్వినియోగపర్చడాన్ని ప్రభుత్వం ఎందుకు అనుమతిస్తున్నది?

మంత్రి: బ్రహ్మాండంగా పని జరుగుతున్నప్పుడు జీపుల పెట్రోలుక్రింద ఎంత ఖర్చు అయినా బాధ అనిపించదు.

శ్రీ వావిలాల: ప్రభుత్వం బ్లాకులకు యిచ్చిన జీపులు, హైదరాబాద్ నగరంలోను, సినిమా హాళ్ళవద్ద సర్వసాధారణంగా దర్శనమిస్తూ వుంటాయి. ఇది కూడా బ్రహ్మాండమైన పనిలో భాగమేనా? ఇలాంటి జీపులను అనేకం నేను ఈ ప్రదేశాలల్లో చూశాను.

మంత్రి: సమీప ప్రాంతాలలో ఉన్న బ్లాకుల జీపుల మరమ్మత్తులకు బహుశా హైదరాబాద్ వచ్చి వుండవచ్చు. అప్పుడు మీకు కనిపించి వుండవచ్చు. (ఈ సమాధానానికి కూడా సభ్యులు ఫక్కున నవ్వారు.)

శ్రీ ఎ. వి. కొండయ్య (కాం): జీపుల విషయంమీద వస్తున్న ఈ ప్రశ్నలనుబట్టి చూస్తే ఇది జీపులు ఉన్నవారికీ, లేనివారికీ మధ్య పోరాటంలా కనిపిస్తూవుంది. కావున సభ్యులకు కూడా జీపులు యిచ్చే విషయం ఆలోచిస్తే యీ సమస్య తీరిపోతుంది.

బోకుల గున్నయ్య(కాం): పెండ్లిండ్లలోను ఇంకా అలాంటి స్వంత వేడుకలలోను బ్లాకుల జీపులు అనేకం కనిపిస్తున్నాయి.

మంత్రి: ఇలాంటి సందర్భాలను నిర్దిష్టంగా మా దృష్టికి తెస్తే, దానికి కారకులైన వారిపై చర్య తీసుకుంటాము.

శ్రీ మైనేని లక్ష్మణస్వామి (కమ్యూ) కేంద్ర సమాజాభివృద్ధిశాఖమంత్రి శ్రీ ఎస్. కె. డే ఇటీవల విజయవాడ వచ్చినప్పుడు బ్లాకు జీపులను ఉపసంహరించాలని సూచించారుగదా?

మంత్రి: జీపులను ఉపసంహరించే సమస్యే లేదు.

శ్రీ వావిలాల: జీపులను ఉపసంహరించాలని ప్రధాన మంత్రి సైతం చెప్పారు.

మంత్రి: ప్రధాని ఆ విషయం చెప్పలేదు.

పంచాయతీ రికార్డులు స్వాధీనం చేయని పాత ప్రెసిడెంట్లు

శాసనసభలో మంత్రి వివరణ

హైదరాబాద్, డిసెంబరు 10

ఆంధ్ర ప్రదేశ్ లో 27 గ్రామాల పంచాయతీ రికార్డులను కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లకు స్వాధీన పర్చడానికి నిరాకరించినట్లు రాష్ట్ర ప్రభుత్వానికి వర్తమానం చేరిందని నేడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పంచాయతీ రాజ్ మంత్రి డాక్టరు లక్ష్మీనరసయ్య వెల్లడించారు.

పంచాయతీ రికార్డులను కొత్త సర్పంచ్ లకు స్వాధీనం చేయడానికి నిరాకరించిన పాత ప్రెసిడెంటులపై చర్యలు తీసుకోవలసిందిగా కలెక్టర్లకు ఉత్తర్వులను పంపించామని, 25 మంది ప్రెసిడెంట్లపై ప్రాసిక్యూషన్ కేసులు పెట్టబడుచున్నవని, మరి రెండు కేసులు ప్రభుత్వ పరిశీలనలో వున్నవని ఆయన వివరించారు.

కాకినాడవద్ద తప్పిపోయిన జాలర్లు

నష్టపరిహారం చెల్లించినట్టు మంత్రి ప్రకటన

హైదరాబాద్, డిసెంబరు 10

ఇటీవల కాకినాడ సమీపంలో సముద్రంలో చేపలు పడుతూ తుపానులో కొట్టుకుపోయి, కన్పించకుండావున్న 75 మంది జాలర్లలోను పదిమంది శవాలు మాత్రమే కన్పించాయని రాష్ట్ర శాసనసభలో నేడు రెవెన్యూమంత్రి శ్రీ ఎస్. రామచంద్రారెడ్డి ప్రకటించారు.

కమ్యూనిస్టుసభ్యులు శ్రీయుతులు వనస రామన్న, వంకా సత్యనారాయణగార్లు ప్రతిపాదించిన 'కాల్ అటెన్షన్' తీర్మానానికి సమాధానమిస్తూ మంత్రి రామచంద్రారెడ్డిగారు తప్పిపోయిన 75 మంది జాలర్ల బంధువులకు నష్ట పరిహారం చెల్లించామని తెలిపారు.

180 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు

కేంద్రం అనుమతికి సమర్పించినట్లు అసెంబ్లీలోమంత్రి వెల్లడి

హైదరాబాద్, డిసెంబరు 10

ఆంధ్రలో 180 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను అమలు పరిచేందుకు అనుమతించ వలసినదిగా కేంద్రానికి సమర్పించినట్లు పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ ఎ వి సుబ్బారెడ్డి నేడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో తెలియజేశారు.

కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ మైనేని లక్ష్మణస్వామి వేసిన ప్రశ్నకు మంత్రి శ్రీ సుబ్బారెడ్డి సమాధానమిస్తూ, విజయవాడ తాలూకా గొల్లపూడి దగ్గర కృష్ణానదినుండి పంపుల ద్వారా నీటినితోడి సాగుభూములకు సరఫరాచేసే పథకాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ పథకంవల్ల గొల్లపూడి, భవానీపురం, జక్కంపూడి, విద్యాధరపురం, నైనవరం, అంబాపురం, పాయకాపురం గ్రామాలకు లాభం చేకూరుతుందనీ, దాదాపు 4291 ఎకరాల సాగుకు నీరు సరఫరా అవుతుందనీ ఈ పథకానికి రు 12 లక్షల 2 వేలు ఖర్చు కాగలదని అంచనా వేయబడిందనీ చెప్పారు. ఈ పథకాన్ని ఈ యేడాది అమలు జరుపుతామని కూడ అన్నారు.

దీనిపై వచ్చిన అనేక అనుబంధ ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ముందుగా 100 పథకాలను, తరువాత 80 పథకాలను కేంద్ర జలవిద్యుత్ కమిషన్ కు అందజేసిందన్నారు. ఈ సందర్భంలో స్పీకరు జోక్యం కల్పించుకొని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు 5 కోట్ల రూపాయలు కేటాయించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు.

ముఖ్యమంత్రి అలా ప్రకటించి వుండక పోవచ్చునని పబ్లిక్ వర్క్సు మంత్రి అన్నారు.

దీనికి సభలోనే వున్న ముఖ్యమంత్రి జవాబివ్వకుండా మౌనం పాటించారు.

గుంటూరు జిల్లాకు సంబంధించిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల గురించి వచ్చిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ, గుంటూరుజిల్లా కంటే ముందు రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అవసరాలను చూడాలని శ్రీ సుబ్బారెడ్డి అన్నారు.

మరొకప్రశ్నకు శ్రీ ఎ.వి. సమాధానమిస్తూ రాజోలుతాలూకా కేశనపల్లి, అంతర్వేది గ్రామాల్లో వున్న విడిచిన బంజరుభూములకు నీటి సరఫరా సౌకర్యాలు కలిగించే విషయానికి ముందుగా పథకాలను, అంచనాలను పరిశీలించిన పిమ్మట ఆలోచించగలమని చెప్పారు.

భారత అలీన విధానం

బి.బి.సి. ఇంటర్వ్యూలో శ్రీ శాస్త్రి పునరుద్ఘాటన

లండన్, డిసెంబరు 9

భారతదేశ అలీన విధానం చెక్కు చెదరకుండా కొనసాగుతుందని భారత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి బ్రిటిష్ రేడియోకు, సినీ టెలివిజన్ ఇంటర్వ్యూలో మరొకసారి నొక్కి చెప్పారు

అమెరికా నుండి ఆయుధ సహాయం పొందడం భారతదేశాన్ని అలీన విధానంనుండి ప్రక్కకు మళ్లించినట్లేనా అన్న ప్రశ్నకు శ్రీ శాస్త్రి యిలా జవాబుచెప్పారు:

"నేనలా అనుకోవడంలేదు. అనేక మిత్ర దేశాలనుండి మాకు సహాయం అందుతూంది. అందుచేత అలీనవిధానంచెక్కుచెదరకుండా ఉంది.

అమెరికా, బ్రిటన్, సోవియట్ యూనియన్లనుండి సహాయం పొందడంలో భారత దేశానికి యిబ్బంది ఏమీ కనబడలేదని కూడా అన్నారు.

బందరునుండి కేరళకు బియ్యం

బందరు, డిసెంబరు 9

బందరునుండి 32 వాగెన్లతో 900 టన్నుల అక్కుళ్ళ బియ్యం కేరళకు గత ఆదివారం పంపామని రివిన్యూ డివిజనల్ ఆఫీసరు శ్రీ వై రామారావు నేడిక్కడ అన్నారు.

తిరునల్వేలికికూడా 5 వాగెన్లు ముడిబియ్యం వెళ్ళినవని అన్నారు. నాల్గువాగెన్లు ఉప్పుడు బియ్యం సోమవారంనాడు కొచ్చిన్ కు పంపామని అన్నారు.

మహారాష్ట్రలో రిపబ్లికన్ పార్టీ సత్యాగ్రహులఅరెస్టు

బొంబాయి, డిసెంబరు 10

మహారాష్ట్రసచివాలయంముందు నిషేధాజ్ఞలనుఉల్లంఘించి సత్యాగ్రహం కొనసాగించిన 150 మంది రిపబ్లికన్ పార్టీ వాలంటీర్లను నేటి సాయంత్రం యిక్కడ అరెస్టు చేశారు. వీరిలో 84 మంది మహిళలను తర్వాత వదలివేశారని మిగిలినవారిపై కేసులు పెట్టారని పోలీసులు చెప్పారు.

బంజరు భూముల పంపిణీకి ధరలపెరుగుదల నిరోధానికి గత 5 రోజులుగా రిపబ్లికన్ పార్టీ దేశవ్యాపిత సత్యాగ్రహం కొనసాగిస్తున్న విషయం పాఠకులకు విదితమే.

పూనాలో శిక్షలు

పూనాలో కలెక్టరు కార్యాలయం ముందు సత్యాగ్రహం కొనసాగించడానికి ఊరేగింపుగా వెళుతున్న 25 మంది మహిళలతో సహా 52 మంది వాలంటీర్లను నేటి సాయంత్రం అరెస్టు చేశారు. వీరిని తరువాత వదలివేశారు ఊరేగింపు బయలుదేరదీసిన 10 మంది దళానికి స్థానిక మేజిస్ట్రేటు 15 రోజులు జైలుశిక్ష విధించారు.

అకోలా

అకోలా జిల్లాలో ఇంతవరకూ 2వేలమంది వాలంటీర్లు సత్యాగ్రహం జరిపారు. వీరిలో 6 వందలమందిని జైళ్ళలో నిర్బంధించి కేసులు నడుపుతున్నారు.

బుల్డానా

బుల్డానా జిల్లాలో సత్యాగ్రహం సందర్భంలో 15 వందల మందిని అరెస్టుచేసి జైలులో పెట్టినట్లు జిల్లా కలెక్టరు చెప్పారు వీరినందరినీ జైలులో పెట్టడానికి స్థానిక ట్రైనింగ్ కళాశాలను తాత్కాలికంగా జైలుగా మార్చినట్లు ఆయన చెప్పారు

రాబర్ట్సన్ పేట

రాబర్ట్సన్ పేట, డిసెంబరు 11

రిపబ్లికన్ పార్టీ ప్రారంభించిన ఆందోళన సందర్భంలో నిన్న యిక్కడ సత్యాగ్రహం జరిపిన 21 మందిని పోలీసులు అరెస్టుచేశారు.

ఈ పార్టీ ఆందోళన సందర్భంలో డిసెంబరు 7 నుండి ఇక్కడ వందమందికి పైగా పోలీసులు అరెస్టుచేశారు.

గుల్బర్గా

ఈ పార్టీ ప్రారంభించిన ఆందోళన సందర్భంలో మునిసిపల్ ఆఫీసు ఎదుట సత్యాగ్రహం జరుపుతున్న 9 మందిని నేడిక్కడ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో అయిదుగురు మహిళలు కూడ గలరు.

వీరితో ఇప్పటివరకు 172 మందిని ఇక్కడ పోలీసులు అరెస్టు చేయుటం జరిగింది.

వార్ధా

రిపబ్లికన్ పార్టీ ప్రారంభించిన ఆందోళన సందర్భంలో ఇక్కడ సత్యాగ్రహం జరుపుతున్న 42 మందిని పోలీసులు నిన్న అరెస్టు చేశారు.

వీరిలో 15 మంది మహిళలు, 20 మంది బాలురు గలరు.

అరెస్టుచేసిన వారందరిని స్థానిక జైలులో నిర్బంధించారు.

వీరితో, వార్ధాలో అరెస్టుచేసినవారి సంఖ్య 181 కి చేరింది.

జునాగడ్ లో విరమణ

జునాగడ్, డిసెంబరు 10

జునాగడ్ లో తను ప్రారంభించిన ఆందోళనను విరమిస్తూ నేడు రిపబ్లికన్ పార్టీ ప్రకటించింది.

ఈ ఆందోళన సందర్భంలో ఈ పార్టీకి చెందిన 108 మందిని ఇక్కడ పోలీసులు అరెస్టు చేశారు. వారి నందరిని నిన్న విడుదల చేయటం జరిగింది.

నర్సరావుపెట హయ్యర్ సెకండరీ స్కూలు అధికారుల నిరంకుశ దర్పానికు నిరసనగా నిరాహారదీక్ష సాగిస్తున్న విద్యార్థులు: శ్రీ మందా నతానియేలు, శ్రీ ఈదర గోపాలరావుగార్లు

పాక్ విద్యార్థి పోరాటంకొనసాగింపు

కరాచీ, డిసెంబరు 10

కరాచీలో పోలీసులు జరిపిన కాల్పులను ఖండించటానికి, జిన్నా సమాధి సమీపానగల ఒక మసీదులో సమావేశమైనవిద్యార్థులను చుట్టుముట్టి వారిలో 105 మందిని నేడిక్కడ పోలీసులు అరెస్టుచేశారు

దీనికిముందు, వీరిని ఇక్కడనుంచి చెదరగొట్టటానికి పోలీసులు లాఠీచార్జీ చేశారు దరిదాపుల్లో వున్న ఇళ్ళల్లోకిపోయి విద్యార్థులు రక్షణ తీసుకున్నారు. కాని పోలీసులు వారిని తరిమి పట్టుకొని ట్రక్కుల్లోవేసి తీసుకవెళ్లారు.

పోలీసుల దౌర్జన్యానికి హింసాకాండకు గురైన, పలువురు విద్యార్థులకు గాయాలు తగిలాయి.

ప్రథమంలో జిన్నా సమాధివద్దనే సమావేశం జరుపుదామని విద్యార్థులు భావించారు. కాని అక్కడకుపోయే మార్గాలన్నిటివద్ద పెద్ద యెత్తున పోలీసులు కావలావున్న కారణంగా, దానికి సమీపంలోవున్న మశీదులో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ మశీదును పోలీసులు చుట్టుముట్టి లాఠీచార్జీచేసి విద్యార్థులను పెద్ద సంఖ్యలో అరెస్టు చేశారు.

పశ్చిమ పాకిస్తాన్ కువ్యాప్తి: విద్యా సంస్థల మూసివేత

కరాచీ, డిసెంబరు 10

కరాచి విద్యార్థులు పదిరోజుల నుండి ఇక్కడ జరుపుతున్న ఆందోళన పశ్చిమ పాకిస్తాన్ లోని అనేక పట్టణాలకు కూడా వ్యాపించింది. ఆకారణంగాఅక్కడకూడాపాఠశాలలను, కళాశాలలను అధికారులు మూసివేయవలసి వచ్చింది

లాహోరులో పోలీసులు నిన్న ఊరేగింపు జరుపుతున్న విద్యార్థులను చెదరగొట్టటానికి లాఠీచార్జీ చేశారు. బాష్పవాయువుకూడా ప్రయోగించారు.

ఈ సందర్భంలో విద్యార్థులు పోలీసులపై రాళ్ళు రువ్వారని అధికారుల ఆరోపణ.

పోలీసులు 12 మందిని అరెస్టుచేశారు.

పట్టణంలో కళాశాలల్ని, విశ్వవిద్యాలయాల్ని నేడుకూడా మూసివేశారు.

కరాచీలో పోలీసుల తుపాకి కాల్పులకు నిరసనగా రావల్పిండిలో నేడు విద్యార్థులుపెద్ద ఊరేగింపు జరిపారు వీరిని చెదర గొట్టటానికి పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు.

రావల్పిండి నగరంలోను, కంటోన్మెంటు, ఇస్లామాబాద్ ప్రాంతాలలోను గల పాఠశాలలను, కళాశాలలను నేటినుండి జనవరి 5 వ తేదీ వరకు మూసివేస్తూ, అధికారులు నేడు ఉత్తర్వులు జారీచేశారు

ఒక నెలరోజులపాటు ఊరేగింపులుగాని, సభలుగాని జరపరాదని నిషేధించారు.

కరాచీలో విద్యార్థులపై, పోలీసులు జరిపిన కాల్పులకు నిరసనగా నవాబ్షాలో నేటికి మూడు రోజులనుండి విద్యార్థులు సమ్మె జరుపుతున్నారు.

విద్యార్థుల ఆందోళన సందర్భంగా సుక్కూరులోని కళాశాలలను, పాఠశాలలను నేటి నుండి జనవరి నాలుగవరకు మూసివేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

హైదరాబాద్ (సింధ్) లో

హైదరాబాద్ (పశ్చిమ పాకిస్తాన్) లో నేటికి నాల్గు రోజులనుండి విద్యార్థులు ప్రదర్శనలు ఊరేగింపులు జరుపుతున్నారు. తమ కోర్కెలను వెంటనే అంగీకరించవలసిందిగా వీరు నినాదాలు చేశారు.

లాయల్పూర్ లో

విద్యార్థులపై కరాచీ పోలీసుల కాల్పులకు నిరసనగా ఇక్కడ గల రెండు కళాశాలలలోని విద్యార్థులు నిరవధిక సమ్మెను ప్రారంభించారు.

వివాదాస్పదమైన యూనివర్శిటీ ఆర్డినెన్సును విరమించవలసిందిగా వీరు డిమాండుచేశారు

విద్యార్థులయొక్క సూచనలను పరిశీలించటం జరుగుతుం దని ఇక్కడ అధికారులు ఒక ప్రకటన జేశారు.

ప్రభుత్వ ఆస్తులకుగాని, ప్రయివేటు ఆస్తులకుగాని నష్టం కలిగించినట్లయితే, ఆ నష్టం కలిగిన ప్రాంతంలోని వారిపై ఉమ్మడి జుర్మానాలు విధించటం జరుగుతుందని, ఈ ప్రకటనలో వివరించారు.

కరాచీలో హర్తాళ్ కు పిలుపు

తమ కోర్కెలను బలపరుస్తూ అన్ని తరగతుల ప్రజలు రేపు కరాచీలో సంపూర్ణ హర్తాళ్ను జరపవలసిందిగా అఖిలపక్ష విద్యార్థి కార్యాచరణ సమితి నేడు విజ్ఞప్తి చేసింది.

తమకోర్కెలు పూర్తిగా ఫలించేవరకు దృఢంగా నిలబడి, ఆందోళన కొనసాగించాలని విద్యార్థులందరినీ ఈ సమితి కోరింది.

విద్యార్థులపై నిరంకుశమయిన దౌర్జన్య పద్ధతులు ఉపయోగించి, హింసాకాండ జరపటం ద్వారా రెచ్చగొడుతున్నారని, వీటివల్ల విద్యార్థుల దృఢమైన దీక్షను సడలించలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించింది.

ఈ అధికారుల చర్యలు గతంలో దేశాన్ని పాలించిన వలస పాలకుల చర్యలను జ్ఞప్తికి తెస్తున్నాయని తెలిపింది.

విద్యార్థి ప్రదర్శకులపై అయూబ్ గూండాలదాడి

ఢాకా, డిసెంబరు 10

విద్యార్థులపై హింసాకాండ సాగిస్తున్నందుకు తూర్పు పాకిస్తాన్ గవర్నరుకు వ్యతిరేకంగా కొమిల్లా జిల్లాలోని బ్రాహ్మన్ బారియాలో స్థానిక విద్యార్థులు జరుపుతున్న నల్ల జండాల ప్రదర్శనపై నిన్న అయూబ్ ఖాన్ గూండాలు దాడిచేసిన ఫలితంగా కనీసం 10 మంది గాయపడ్డారని, వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత తీవ్రంగా వుందని వార్తలందాయి.

స్థానిక కళాశాలలోని ఆవరణలోకి, హాస్టల్లోకి పోలీసులు ప్రవేశించి విద్యార్థులను చెదరగొట్టి 40 మందిని అరెస్టు చేశారు.

ఈ ఘర్షణలో ఒక ఎలక్టోరల్ కాలేజీ సభ్యుడు, కొంతమంది పోలీసులుకూడా గాయపడినట్లు ప్రభుత్వ ప్రకటన పేర్కొన్నది.

తూర్పు పాకిస్తాన్ గవర్నరు నిన్నఇక్కడ ఒక బహిరంగసభలో మాట్లాడడానికి వచ్చిన సందర్భంలో కరాచీలోనూ, జగర్వార్ లోనూ విద్యార్థులపై పోలీసు కాల్పులకు నిరసనగా విద్యార్థులు ప్రదర్శనలు జరిపారు.

విద్యార్థి కోర్కెల పరిశీలనకు కమిటీ

ఆంధ్ర విశ్వవిద్యాలయ అకడమిక్ కౌన్సిల్ చే 11 మంది సభ్యులతో నియామకం

వాల్తేరు, డిసెంబరు 10

ఆంధ్ర విశ్వ విద్యాలయ అకడమిక్ కౌన్సిల్ అనుబంధ కళాశాలల్లోని విద్యార్థులు కొనసాగించిన సమ్మెపై నేడు చర్చించి విద్యార్థుల కోర్కెల పరిశీలనకు 11 మంది సభ్యులతో ఒక కమిటీని నియమించింది

ఆంధ్ర విశ్వ విద్యాలయ అకడమిక్ కౌన్సిల్ సమావేశం నేడిక్కడ వైస్ ఛాన్సలర్ శ్రీ ఎ. ఎల్. నారాయణ అధ్యక్షతనజరిగింది.

ఈ కమిటీ 1965 సంవత్సరం ఫిబ్రవరి నెలలోపుగా విద్యార్థుల కోర్కెలను పరిశీలించి నివేదిక సమర్పిస్తుందట దీనిపై అనుబంధ కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులవద్దనుండి సాక్ష్యాలను సేకరిస్తుందట. ఈ కమిటీ సిఫారసులను రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షుల ముందుంచి అవసరమైతే అకడమిక్ కౌన్సిల్ మార్చిలో సమావేశమై కమిటీ సిఫారసులను పరిశీలిస్తుందట.

ఆంధ్ర విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల విద్యార్థులు ప్రధానంగా ఈ క్రింది కోర్కెల సాధనకై క్రితం జనవరిలో నిరసన సమ్మె, మార్చిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎదుట నిరాహారదీక్ష, తిరిగినవంబరులో వారం రోజులపాటు సమ్మె జరిపిన విషయం పాఠకులకు విదితమే.

1. డిగ్రీ తరగతులలో డివిజన్ పద్ధతిని రద్దు చేయాలి.
2. డిగ్రీ తరగతిలో జనరల్ ఎడ్యుకేషన్ సంస్కరించాలి.
3. బి. కాం. డిగ్రీ కోర్సులో హిందీ పరీక్షను రెండవ సంవత్సరంలోనే జరపాలి.
4. పరీక్ష కాలాన్ని మూడు గంటలకు పెంచాలి.
5. పి. యు సిలో పరీక్ష పత్రాలను సంస్కరించాలి.
6. కళాశాలల్లో ఫైనల్ సంవత్సరం విద్యార్థులకు ఎన్ సి. సి. శిక్షణను నిర్బంధం చేయరాదు.

విద్యార్థుల కోర్కెలలో ప్రధానమైనవి ఇవి:

విశ్వ విద్యాలయ కళాశాలలో అనుసరిస్తున్న పద్ధతిని వచ్చే విద్యాసంవత్సరం నుండి అనుబంధ కళాశాలలకు కూడా వర్తింపజేయాలని మాజీ రిజిష్ట్రారు శ్రీ కె వి. గోపాలస్వామి చేసిన సూచనలు అమలుజరపడానికి అకడమిక్ కౌన్సిల్ ఆమోదించింది.

ఉపాధ్యాయ నియోజకవర్గాల రద్దు

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ కార్యవర్గం నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబరు 10

శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గా లన్నింటిని రద్దుచేయాలని నేడిక్కడ సమావేశమైన కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ కార్యవర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది.

ప్రధాని శాస్త్రితో శ్రీమతి విజయలక్ష్మి భేటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 10

ఇటీవల లోక్ సభకు ఫూల్పూరు నియోజకవర్గం నుంచి ఎన్నికైన శ్రీమతి విజయలక్ష్మి పండిట్ నేడు ప్రధాని శాస్త్రిని కలుసుకొని మాట్లాడారు.

నాల్గవ ప్రణాళికలో భూగర్భ పరిశోధనకు రు. 10 కోట్లు

డెహ్రాడూన్, డిసెంబరు 9

నాల్గవ ప్రణాళికా కాలంలో దేశంలో భూగర్భ పరిశోధనకు రు. 10 కోట్లు కేటాయించాలనే ప్రతిపాదన వుందని భూగర్భ పరిశోధక సంస్థప్రతినిధి ఒకరన్నారు.

బ్రిటిష్ గయానా

(1 వ పేజీ తరువాయి)

బ్రిటిష్ ప్రివీ కౌన్సిల్ మాత్రమే యేమైనా చేయగలదని రాజకీయ పరిశీలకులంటున్నారు.

ఈ పరిస్థితిలో తిరిగి జాతీయ శాసనసభ సమావేశం జరిగినా ఫలితం శూన్యం డాక్టర్ జగన్ మంత్రివర్గానికి అందులో మెజారిటీ వుండదు గనుక యీ రాజ్యాంగ సంక్షోభం యథాతథంగానే వుండిపోతుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

సైనిక బందోబస్తు

తాను రాజీనామా యివ్వడం లేదంటూ గవర్నర్ కు ప్రధాని తెలియజేసిన మరుక్షణంలోనే బ్రిటిష్ గయానా అంతటా మూడువేల మంది స్థానిక సైనికులు, మరో 1300 మంది బ్రిటిష్ సైనికులూ ఎక్కడి కక్కడ నగర వీధుల్లోనూ, కూడలి స్థలాల్లోనూ ప్రత్యక్షమైనారు.

గవర్నర్, జగన్ ప్రభుత్వాన్ని తొలగించడానికి నిశ్చయించారనీ, అయితే, లండన్ నుండి ఆదేశం కోసం ఎదురుచూస్తున్నారనీ, ఆయన ప్రతినిధి ఒకరు పత్రికల వారితో చెప్పారు.

బ్రిటిష్ గవర్నర్ యీ తాజా పరిణామాల గురించి రాజధానిలోని అమెరికా కాన్సల్ జనరల్ తో మంతనాలాడుతున్నారు.

బ్రిటిష్ గయానా శాసనసభలో పార్టీల పరిస్థితి

జార్జిటౌన్, డిసెంబరు 10

బ్రిటిషు గయానా ఎన్నికల తుది ఫలితాలు ప్రకటించడంతో ప్రజాప్రతినిధుల సభలో ఆయా పార్టీల బలాబలాలు ఈ క్రిందివిధంగా వున్నాయి:

డాక్టరు చెడ్డిజగన్ నాయకత్వానగల పీపుల్స్ ప్రోగ్రెసివ్ పార్టీ ప్రథమ పార్టీగా 24 స్థానాలు, బర్న్హామ్ నాయకత్వానగల పీపుల్స్ నేషనల్ కాంగ్రెసు ద్వితీయపార్టీగా 22 స్థానాలు, యునైటెడ్ ఫోర్స్ పక్షానికి 7 స్థానాలు లభించాయి.

ఏ పార్టీకి మెజారిటీ లేని ఈ పరిస్థితులలో బర్న్హామ్ పక్షం, యునైటెడ్ ఫోర్స్ పక్షం కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల సూచనలు కన్పిస్తున్నాయి.

"అణ్వాస్త్ర కవచాన్ని నేను కోరలేదు"

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీలో తన లండన్ పర్యటనపై నివేదిస్తూ శ్రీ శాస్త్రి ప్రసంగం

న్యూఢిల్లీ, డిసెంబరు 10

చైనా అణ్వస్త్రం నుంచి రక్షణకు "గొడుగు"ను గాని, 'కవచాన్ని' గాని తాను బ్రిటిషు మంత్రులను కోరే ప్రశ్నే లేదని ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి నేడు-కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ సమావేశంలో చెప్పినట్లు తెలుస్తున్నది.

అయితే, అణ్వస్త్ర విస్తరణతో అణ్వస్త్ర రహిత దేశాలకు ప్రమాదం అధికమవుతున్నదనీ, అందుచేత ప్రధానమైన అణ్వాయుధ రాజ్యాలు ముఖ్యంగా అమెరికా, సోవియట్ యూనియన్ వంటి రాజ్యాలు, అణ్వస్త్ర రహిత రాజ్యాలకు ప్రమాదం వాటిల్లకుండా నివారించే మార్గం ఆలోచించాలని మాత్రం తాను ఆ దర్శన సందర్భంలో సూచించిన మాట నిజమేనని శ్రీ శాస్త్రి వివరించారట.

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ సమావేశంలో శ్రీ శాస్త్రి తన లండన్ పర్యటనపై నివేదించిన సందర్భంలో పై విషయం పేర్కొన్నారు.

బ్రిటిష్ ప్రధాని విల్సన్ తో తమ దర్శన సందర్భంలో ప్రపంచ శాంతి రక్షణ సమస్య పరంగా చైనా సమస్య ప్రస్తావన వచ్చినట్లు శ్రీ శాస్త్రి చెప్పారు.

చైనాను ప్రతిఘటించేటందుకు భారతదేశం తన శాయశక్తులా సన్నాహాలు చేసుకుంటున్నది. చైనా అణ్వస్త్ర పరీక్ష ఒక సరికొత్త పరిణామం. భారతదేశం అణ్వస్త్ర పోటీలో చేరడానికి యిష్టపడటంలేదు. అందుకని ఈ ప్రమాద నివారణకు అన్య మార్గాలు అన్వేషించవలసి వస్తున్నదని తాను విల్సన్ తో చెప్పా నన్నారు.

భారతదేశం ఒక్కటేగాకుండా, అణ్వస్త్రాలు లేని మిగతా రాజ్యాలుకూడా యిదే విధంగా ఆందోళన చెందుతున్నవి. భారతదేశం మాస్కో ఒప్పందాన్ని భూగర్భంలో జరిగే అణుపరీక్షలకు కూడా వర్తింపజేయాలని కోరుతున్నది. తాజా పరిణామాల దృష్ట్యా, అగ్రరాజ్యాలు, అణ్వస్త్రవ్యాప్తిని అరికట్టేటందుకు బాధ్యతవహించాల్సిన తరుణం వచ్చింది. అని తాను విల్సన్ కు వివరించా నన్నారు.

అగ్రరాజ్యాలు గనుక యేమీ చేయకపోతే, అణ్వస్త్రాలు లేని దేశాలు ఐ. రా. స. లోను, యితరత్రానూ ఆందోళన చేయవలసి వుంటుందనీ, అందుకు ప్రజాభిప్రాయాన్ని సమీకరించాల్సి వుంటుందని ఆయన సభ్యులడిగిన కొన్ని ప్రశ్నలకు జవాబిచ్చారు.

ఐరాసలో అన్ని దేశాలకూ ఓటింగ్ హక్కు సరిసమానంగానే వుంటుంది. అయితే అగ్రరాజ్యాలయిన అమెరికా రష్యాలకున్నప్రధాన బాధ్యత యింతవని అయన అన్నారు.

కాశ్మీర్ సమస్య

భారత, పాక్ సంబంధాల సమస్య, కాశ్మీర్ సమస్యకూడా తమ దర్శనలో ప్రస్తావనకు వచ్చినట్లు ఆయన తెలియజేశారు. భారత దేశం పాకిస్తాన్ కు నిర్యుద్ధ ఒప్పందం చేసుకుందామని ప్రతిపాదించింది. వారు దానిని ఆమోదించలేదు. కాశ్మీరు సమస్య క్లిష్టమైనదే. అయితే ఉభయుల మధ్య వివాదంలోవున్న ఇతర కొన్ని సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని తాను విల్సన్ కు చెప్పానన్నారు.

మరో ప్రశ్నకు జవాబిస్తూ, బ్రిటన్ తన దిగుమతులపై విధించిన సర్ చార్జీలను యిప్పుడప్పుడే తీసివేయక పోవచ్చు. అయితే, వారి ఎగుమతి దిగుమతుల మధ్య వ్యత్యాసం పరిస్థితి కొంతమెరుగవుతేవారావిషయాన్ని తప్పక పునర్విచారణజరుపుతారనేతాను ఆశిస్తున్నానన్నారు.

కాంగోలో అమెరికా, బెల్జియంల ప్రమేయాన్ని నిరసిస్తూమాస్కోలో విదేశీ విద్యార్థులు అమెరికా రాయబార కార్యాలయంముందు ప్రదర్శన చేస్తున్న దృశ్యం. (రేడియోఫోటో)

భూటాన్ లో అమెరికా కుట్ర?

"ఇజ్వెస్తియా" ఢిల్లీ విలేకరి వెల్లడి

మాస్కో, డిసెంబరు 10

భూటాన్ వ్యవహారాలలో అమెరికా జోక్యం కల్పించుకొని, ఇండియాకు వ్యతిరేకంగా అలజడి రెచ్చగొడుతున్నట్టు సోవియట్ ప్రభుత్వపత్రిక "ఇజ్వెస్తియా" న్యూఢిల్లీ విలేకరి పంపిన వర్తమానంలో ధ్వనింపజేశారు.

1949లో భారతదేశానికి భూటాన్ కు మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం భూటాన్ రక్షణ బాధ్యత, విదేశ వ్యవహారాల నిర్వహణ బాధ్యతకూడా భారతదేశం స్వీకరించిందన్న విషయాన్ని ఆ విలేకరి పేర్కొన్నారు.

భూటాన్ రాజుకు వ్యతిరేకంగా ఇటీవల కొందరు సైనికాధికారులు పన్నిన కుట్రవెనుక అమెరికా హస్తం లేదా అన్న అనుమానం ఢిల్లీలోని రాజకీయ పరిశీలకులు వెలిబుచ్చుతున్నట్లు ఆ విలేకరి తెలిపారు.

సరిహద్దు గ్రామంపై పాక్ సైనికుల కాల్పులు

భారీఎత్తున కొనసాగింపు

అగర్తాలా, డిసెంబరు 10

త్రిపుర రాష్ట్రంలోని కరంగిచెరా గ్రామంపై ఈ నెల 7 వ తేదీ ఉదయం నుండి నిన్నటి వరకు తూర్పు పాకిస్తాన్ రైఫిల్ దళం భారీ యెత్తున కాల్పులు కొనసాగించినట్లు నేడిక్కడ అధికారయుతంగా ప్రకటించారు.

ఈగ్రామంలోని రైతులను పంటలు కూర్చుకోకుండా నిరోధించేదుకు నవంబరు 17 ను ది ప్రారంభించి పాక్ సాయుధ దళాలు నిర్విరామంగా కాల్పులు కొనసాగిస్తున్నాయి

ఢిల్లీలో కాంబోడియా అమెరికాల చర్చలు

న్యూఢిల్లీ, డిసెంబరు 10

అమెరికా, కాంబోడియా దేశాల మధ్య సంబంధాలను బాగుపర్చడం కోసం ఇక్కడ ఉభయ దేశాల ప్రతినిధుల మధ్య జరుగుతున్న చర్చలు నేడు కూడా రెండు గంటలపాటు కొనసాగాయి.

తంతి, తపాలాశాఖ ఉద్యోగులకు చౌక డిపోలు ఏర్పాటు

న్యూఢిల్లీ, డిసెంబరు 10

తంతి తపాలా శాఖ ఉద్యోగులకు చౌక డిపోలు ఏర్పాటు చేయడానికి 11 రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ సత్యనారాయణ సిన్హా నిన్న తంతి, తపాలా సర్కిల్స్ అధికారుల సమావేశంలో మాట్లాడుతూ వెల్లడించారు.

మదురైలో ప్రముఖ రవాణా సంస్థపై అధికారుల సోదా

మదురై, డిసెంబరు 10

మదురైలోని ప్రముఖ రవాణాసంస్థ యజమాని కార్యాలయంపైనీ, నివాసభవనంపైనీ ఆదాయపుపన్ను అధికారులు ఒకే సమయంలో దాడిచేసిసోదాజరిపారు. నగదు, నగలూ, సుమారు అయిదు లక్షల మేరకు ఆదాయపుపన్ను ఎగవేతను బయటపెట్టే పత్రాలు దొరికాయని అధికారులు అంటున్నారు.

యూథాంట్ ఆరోగ్యం

ఐరాస, డిసెంబరు 10

తాను బాగా కోలుకొంటున్నానని ఐరాస ప్రధాన కార్యదర్శి యూథాంట్ నేడు సర్వ ప్రతినిధుల సమావేశానికి తెలియజేస్తూ హాస్పిటలు నుండి రాసిన లేఖను సమావేశ అధ్యక్షులయిన అలెక్స్ క్వైసన్ నేడు ప్రతినిధులకు చదివి వినిపించారు.

శాసనసభ వాయిదా

(1వ పేజీ తరువాయి)

న్నట్లు ప్రభుత్వ లెఖ్ఖలే తెలుపుతున్నాయి. అందువల్ల రాష్ట్రంలో పారిశ్రామికీకరణ జరగాలి అందుకు విద్యుత్ విరివిగాలభ్యంకావాలి. మొదటి ప్రణాళికలో విద్యుత్ కు 34 శాతం కేటాయించారు. 2, 3 ప్రణాళికలలో అదేరేటున కేటాయించకుండా తగ్గించారు. 4 వ ప్రణాళికలో అయినా ఈ అవసరాన్ని గమనించినట్లు లేదు.

నాల్గవ ప్రణాళికలో శ్రీ శైలం ప్రాజెక్టు ప్రస్తావన కనుపించటంలేదు ఆ ప్రాజెక్టు కేంద్రం తీసుకుంటుందో లేదో తెలియకుండా వుంది.

అలాగే నాగార్జునసాగర్ దగ్గర రెండవ దశలో విద్యుత్ ఉత్పత్తి చేస్తామని గతంలో చెప్పారు. ఆ ప్రస్తావన ఇప్పుడులేదు. అందువల్ల మన యావత్ శక్తిని కేంద్రీకరించి విద్యుత్ ఉత్పత్తిని పెంచాలి.

గత మూడు ప్రణాళికలలో వెనుకబడిన తెగలు, కులాలకు అన్యాయం జరిగింది. ఈసారయినా వారికి న్యాయం జరిగేటట్లు చూడాలి.

చర్చకు ఆర్థిక మంత్రి చెన్నారెడ్డి సమాధానం ఇస్తూ, సోషలిస్టు దేశాలలో పంపిణీ, మారకం, ఉత్పత్తి అంతా ప్రభుత్వం చేతిలో వుంటుంది గనుక అనుకున్నలక్ష్యాలు సాధించగలుగుతున్నారని, కాని ప్రజాస్వామిక దేశమయిన మన దేశంలో వివిధ-[illegible] అభిప్రాయాలు, [illegible] వున్నవారున్నందున అందరినీ కలుపుకురావలసి ఉన్నందువల అనుకున్న లక్ష్యాలను సాధించటంలో కొంత వరకు విఫలం అవుతున్నామని అన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు 4 వ ప్రణాళికలో 6 కోట్లు కేటాయించామని చెప్పారు.

నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు కేంద్రం తీసుకుంటే రాష్ట్రం నాల్గవ ప్రణాళికావ్యయము 780 కోట్లవరకూ ఉంటుందన్నారు.

సరిహద్దు రాష్ట్రాలతో నదీజలాల వివాదం వల్లా, ఒరిస్సాతో పేచీవల్ల అనుకున్న విద్యుత్ పథకాలు సకాలంలో చేబట్టలేకపోయామన్నారు.

విద్యాభివృద్ధికని కేటాయించిన మొత్తం నుండి కొంతదీసి విద్యుత్ పథకాలకు, పారిశ్రామికీకరణకు వాడుతున్నామని అన్నారు.

సామాన్యుని కందని ప్రణాళికా ఫలితాలు

శాసనసభలో శ్రీ కాటూరి రామచంద్రరెడ్డి విమర్శ

హైదరాబాద్, డిసెంబరు 10

ప్రణాళికా ఫలితాలు సామాన్యునికి చేరటంలేదని, అవి ధనికులకు మాత్రమే లభ్యమవుతున్నాయని శ్రీ కె రామచంద్రారెడ్డి (కమ్యూనిస్టు) నేడు 4 వ. ప్రణాళికపై జరిగి చర్చలో పాల్గొంటూ చెప్పారు.

వ్యవసాయ ఉత్పత్తికి ముందు సక్రమ భూసంస్కరణలు జరగాలని కోరారు.

శ్రీ పేట బాపయ్య మాట్లాడుతూ వ్యవసాయ అవసరాలను విద్యుచ్ఛక్తి విరివిగా అందించాలని సూచించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ఎరువుల అవసరాలను తీర్చడానికి వెంటనే ఒక ఫ్యాక్టరీని నెలకొల్పాలని కోరారు.

స్వతంత్ర పార్టీ నాయకుడు శ్రీ జి. లచ్చన్న మాట్లాడుతూ 14 సంవత్సరాల ప్రణాళికాభివృద్ధి జరిగిన తర్వాత ఆహారసమస్య పరిష్కారం కాకపోవటం విచారకరమని అన్నారు. ఇందుకు కారణం ప్రణాళికలయినా సరైనవి కాకపోవాలి. లేదా వాటిని అమలు జరపటంలో నయినా పొరపాట్లు జరుగుతూ వుండి వుండాలన్నారు.

ఒక 'భూతం'గా తయారయిన ప్రణాళికా సంఘాన్ని రద్దుచేయాలని కోరారు

ప్రణాళికల పుణ్యమా అని పన్నుల భారం మాత్రం పెరిగి దని విమర్శించారు.

ప్రణాళికవల్ల ప్రజల ప్రాథమికావసరాలు కూడా నెరవేరలేదన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలో నిర్బంధ ప్రాథమిక విద్యను అమలుజరపడానికి 12 వేల ఉపాధ్యాయుల కొరత ఉందని చెప్పారు.

రాష్ట్ర తృతీయ పంచవర్ష ప్రణాళికలోని చివరి సంవత్సరంలో 77 కోట్లు ఖర్చు చేయడానికి పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది.

రేడియో

ఆదివారం, డిసెంబరు 13
శక 1886 ★ మార్గశిర 22

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు: 6-40 అం. వా. 6-45 భక్తిరంజని- సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలు: 6-55 సూక్తిముక్తావళి. 7-0 తె. వా: 7-15 సంగీతశిక్షణ. 7-30 హై. రిలే: 7-45 సుబద్ధ సంగీత్: 8-00 అం. వా: 8-15 ప్రాంజలి. 8-30 పాంచెల్లి; 9-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 వయొలిన్: 1-00 హై. రిలే. 1-40 హిం. వా: 1-50 తె. వా: 2-00 వాతావరణ సూచన. ప్రసార సమాప్తి

3-00 ధారా గుర్జాటీ - నాటిక: 4-00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు: 6-05 ప్రాం. వా: 6-15 ప్రస్తుతాంశం, 6-20 గ్రామస్థులకు, 7-00 తె. వా: 7-15 గ్రామస్థులకు: 7-30 ఫిల్మ్ సంగీతం: 7-45 నైతిక ప్రమాణాలు: దేశరక్షణ - వాణిజ్యంలో ప్రసంగము: 8-0 హరి త్యాగశంకర రామనరసింహ శాస్త్రి: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా: 9-15 ఆంగ్లమున: 9-25 విరామ సంగీతం: 9-30 ఎచెర్ మెమోరియల్ లెక్చర్స్. ఢి రి: 10-00 వయొలిన్, 10-30 అం. వా: 10 35 వాతావరణసూచన, సమాప్తి- జన గణ మన.

హైదరాబాద్ - ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాతం, కార్యక్రమ వివరణ: 6-40 అం. వా. 6-45 భక్తిరంజని- ఢి. రిలే: 6-55 సూక్తిముక్తావళి: 7-0 తె.వా: 7-15 సంకీర్తనం, 7-30 'అమరవాణి'; 7-45 సుబద్ధ సంగీత్: 8-00 అం. వా: 8-15 లలిత సంగీతం: 8-30 మరాఠీ శ్రోతలకు: 9-00 బచ్చోం కేలియే: 9-30 కన్నడ శ్రోతలకు, 10-00 హిందీలో కదంబకార్యక్రమం: 11-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 చిత్రజగత్: 1-00 రంగవల్లి - శ్రోతలు కోరిన పాటలు, 1-40 హిం. వా, 1-50 తె. వా: 2-00 వాతావరణ సూచన. ప్రాదేశిక్ సుగమ సంగీత్: 2-10 ఆ. వా, 2-20 బాలవినోదం: 3-00 ఢి. రిలే, 4-00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు: 6-05 ప్రాం. వా. 6-15 ప్రస్తుతాంశము, 6-20 హై. బి. వలె: 7-00 తె. వా: 7-15 హై.బి. 7-30 నగర శ్రోతలకు. సాంఘిక స్థితిగతులు- ఉద్యోగం వనితాలక్షణం-ఉదాహరణాన్వేషణ. 7-45 హై. బి. వలె: 8-00 సెన్స్ ఎమీజ్. 8-10 కిరామ సంగీతం: 8-15 చిత్ర సీమ: 8-45 ఆటల సమీక్ష - ఉర్దూ. 8-55 ప్రస్తుతాంశం: 9.0 అం. వా. 9-15 ఉ. వా: 9-30 ఢి. రిలే, 10-00 ఉర్దూలో కార్యక్రమం, 10-35 వాతావరణ సూచన, సమాప్తి - జన గణ మన.

హైదరాబాద్ - బి

కడప

265.1 మీ (1130 కిలోసై)

విశాఖపట్నం

322.6 మీ (930 కిలోసై)

సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

39.42 మీ (3355 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6.30 హై ఎ.వలె; 7-45 సమాప్తి:

60.12 మీ (4990 కిలోసై.)

8-00 హై. ఎ.వలె: 8-30 ఇ నాగరాజు. 9-30 ప్రసార సమాప్తి.

42.02 మీ (7140 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

మధ్యాహ్నం: 12-30 హై. ఎ వలె: 2.10 కదంబం: 2-30 హై. ఎ. వలె: 4-00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-00 హై. ఎ. వలె: 6-20 గ్రామస్థులకు: 7-00 తె వా: 7-15 గ్రామస్థులకు: 7-30 వాద్యగోష్ఠి - నిలయ విద్వాంసులు: 8-00 హై ఎ. రిలే, 8-45 గాన మాధురి, 8-55 హై ఎ. వలె: 9-15 ఆంగ్లమున: 9-30 సంగీతామృతం: 10-30 హై. ఎ. వలె: 10.35 సమాప్తి - జన గణ మన.

మద్రాస్ - బి

211.3 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40 అం. వా: 6-45 మ. ఎ. రిలే: 7-00 తె. వా: 7-15 సంగీత సుంజరి. 7-30 చిత్రగానం: 8-00 అం. వా: 8-15 శిలక్కాడ్ ఎస్. రామనారాయణ అయ్యర్. 9-15 ప్రసార సమాప్తి

211-3 మీ (1420 కిలోసై)
41-90 మీ (7160 కిలోసై)

మధ్యాహ్నం: 10-45 ఆటవిడుపు: 11-30 కళారంగం: 12-00 హుమశ్రీ: 12-30 సూర్యకాంతి- తి. రిలే: 1-00 పాద్యగోష్ఠి. 1-30 అం. వా: 1-40 గీత మంజరి: 1-50 తె. వా: 2-00 మధురగీతం: 2-10 పాపామలర్: 3-0 కుంభకోణం వి. పి. రాజేశ్వరి: 4-0 సమాప్తి.

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం: 6-00 అం. వా: 6-05 మ. ఎ. వలె: 6-20 వాతావరణ సూచన, స్థానిక ప్రకటనలు అంగ్లం: 6-30 కార్యక్రమ వివరణ-తమిళం: 6-35 వి. కృష్ణమూర్తి: 7-00 తె. వా: 7-15 క్లారినెట్ - నిలయ విద్వాంసుడు: 7-30 తమిళ ప్రసంగం: 8.30 వీణ: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా. 9-15 ఆంగ్లమున: 9-30 ఢి రి లే: 10-00 పాశ్చాత్య సంగీతం: 11-00 అం. వా: 10-35 సమాప్తి - జన గణ మన.

డిస్ట్రిబ్యూటర్లు కావలెను

గ్యాస్ట్రిక్ వ్యాధుల నివారణకు ప్రసిద్ధిగాంచిన 'గాస్‌టాన్' బిళ్ళల విక్రయమునకు డిస్ట్రిబ్యూటర్లు కావలెను.

R. PAREKH & Co.,
Chemists & Druggists,
P. O. Box 2510, BOMBAY-2.

పాలసీపోయినది

లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మచిలీపట్నం డివిజనల్ ఆఫీసుచే శ్రీ రాఘవ వెంకట సత్యనారాయణమూర్తిగారి జీవితముపై జారీచేయబడిన పాలసీ నెం. 12825169 పోయినది. ఈ తేదీ నుండి నెలరోజులలోగా మాకెలాంటి అభ్యంతరములు అందనిచో తిరిగి డూప్లికేట్ పాలసీ యివ్వబడును.

(సం) టి. యస్. కృష్ణమూర్తి, ఎం.ఎ.,
యఫ్. ఐ. ఐ. ఐ.
సీనియర్ డివిజనల్ మేనేజర్,
లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
మచిలీపట్నం.



మార్క్సిజం - లెనినిజం అనగా ఏమిటి?
స్వయంగా చదవండి!

కమ్యూనిస్టుపార్టీ ప్రణాళిక - మార్క్స్, ఎంగెల్సు	రు. 0—20
విలువ, ఖరీదు, లాభం మార్క్స్	0—25
కూలిపని: పెట్టుబడి - మార్క్స్	0—15
వలసవిధానం వ్యాసావళి - మార్క్స్, ఎంగెల్సు	2—00
సోషలిజం: ఊహాజనితమూ, శాస్త్రీయం - ఎంగెల్సు	0—50
కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగ యంత్రాల పుట్టుక - ఎంగెల్సు	0—75
"అతివాద" కమ్యూనిజం: ఒక బాలారిష్టం - లెనిన్	0—60
రాజ్యాంగయంత్రం, విప్లవం - లెనిన్	0—31
సామ్రాజ్యవాదం: పెట్టుబడిదారీ విధానపు అత్యున్నతదశ - లెనిన్	1—00
గ్రామీణ పేదలకు - లెనిన్	0—13
రాజ్యాంగయంత్రం - లెనిన్	0—07
మార్క్సిజం యొక్క చారిత్రకాభివృద్ధిలో కొన్ని విశిష్ట లక్షణాలు లెనిన్	0—13
ఏంచేయాలి? - లెనిన్	1—00

పోస్టేజి అదనం

ప్రచురణ

విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ-4.

విశాలాంధ్ర బుక్ హౌస్, సుల్తాన్ బజారు, హైదరాబాద్.

ADMARK-64

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ డిసెంబరు 11

విజయవాడ రీజనల్ అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టరు 10-12-64న అందజేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలు చేయబడిన టోకు ధరలు (ఒక క్వింటాల్ 100 కిలోగ్రాములు. లేక 220½ పౌనులు)

ధాన్యం

		75 కి.	100 కి.
నంబర్లు:	విజయవాడ	రు. 33-37	44 49
„	కాకినాడ	—	—
„	చిత్తూరు	—	—
అక్కుళ్లు:	విజయవాడ	29 73	39 64
„	తాడేపల్లిగూడెం	29 73	39 64
„	కాకినాడ	29 73	39 64
„	అముదాలవలస	27 93	39 64
సన్నకృష్ణకాటుకలు:			
	తాడేపల్లిగూడెం	29 73	39 64
సన్నాలు:	ఆముదాలవలస	31 98	42 67
మొలకొలుకులు	నెల్లూరు	రు —	47 58

మిల్లు బియ్యం

నంబర్లు:	విజయవాడ	రు. 72 00
„	కాకినాడ	72 00
అక్కుళ్లు:	విజయవాడ	64 00
„	తాడేపల్లిగూడెం	64 00
„	కాకినాడ	64 00
„	అముదాలవలస	62 51
సన్నకృష్ణ కాటుకలు:		
„	తాడేపల్లిగూడెం	68 00
నంబర్లు:	చిత్తూరు	79 67
సన్నాలు:	ఆముదాలవలస	69 00
మొలకొలుకులు:	నెల్లూరు	77 00

వేరుశనగ

కాయలు	విజయవాడ	86 95
„	నంద్యాల	82 50
„	ఆదోని	87 75
„	విజయనగరం	84 44
పప్పు	విజయవాడ	127 50
„	నంద్యాల	117 18
„	ఆదోని	116 00
„	విజయనగరం	130 66
నూనె	విజయవాడ	245 00
„	నంద్యాల	232 50
„	ఆదోని	226 50
„	విజయనగరం	253 26

అపరాలు

కందులు:	విజయవాడ	రు. 96 00
„	గుంటూరు	108 00
„	అముదాలవలస	—
మినుములు:	విజయవాడ	70 00
„	గుంటూరు	75 00
„	అముదాలవలస	82 98
పెసలు:	విజయవాడ	86 00
„	గుంటూరు	86 00
„	అముదాలవలస	95 69
శనగలు:	విజయవాడ	130 43

జొన్నలు

అనంతపురం:	తెల్లవి	58 00
నంద్యాల	పచ్చవి	69 00

బెల్లం

అనకాపల్లి:	మొదటిరకం	78 70
„	మూడవరకం	67 50
చిత్తూరు	మొదటిరకం	56 00
„	మూడవరకం	44 00

జీడిపప్పు

వేటపాలెం:	అమెరికన్‌రకం	రు. 663 00
„	దేశవాళి	682 00
„	బద్దలు	550 00
„	ముక్కలు	470 00

మిర్చి

జి2 ఒకటవ రకం గుంటూరు	165 00
జి రెండు 2వ రకం „	180 00
జి 2 దర్జ రకం	

నెయ్యి

	పల్నాడు	దేశవాళి
గుంటూరులో	590 00	600 00

కొబ్బరికాయలు

(వెయ్యింటికి ధరలు)	కొత్తవి:	పాతవి
విజయవాడ	—	290 00
రాజమండ్రి	170 00	240 00
పాలకొల్లు	170 00	240 00

పసుపు

దుగ్గిరాలలో,	కొమ్ములు	రు. 193 50
„	కాన్పూరు	161 00
„	దుంపలు	121 00
కడపలో	కొమ్ములు	145 50
„	దుంపలు	114 00

జనపనార

విజయనగరం	మొదటిరకం	85 74
	రెండవరకం	80 83
	మూడవరకం	77 70
అముదాలవలసలో	మొదటిరకం	81 83
	రెండవరకం	76 00

బడుగు ప్రాంతాల అభివృద్ధి

ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని కేంద్ర ఆర్థికమంత్రి హామి

న్యూఢిల్లీ, డిసెంబరు 10

ఉత్తర ప్రదేశ్‌తోసహా దేశంలోని వివిధ వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి పరిచే విషయం నాలుగో ప్రణాళికా పథకాల తయారీ సందర్భంలో దృష్టిలో వుంచుకోవడం జరుగుతుందని ఆర్థికమంత్రి నిన్న రాజ్యసభలో చెప్పారు.

తాము ఇప్పుడు మూడో ప్రణాళిక చివరి సంవత్సరంలోనూ, మరునటి ప్రణాళిక తొలి సంవత్సరంలోనూ చేర్చవలసిన యిలాంటి పథకాలగురించి అధ్యయనం చేస్తున్నామనీ, యిందుకు ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుని సహాయం తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గురించి ప్రభుత్వం చేస్తున్న దేమిటని పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబుగా ఆయన యీ సమాధానం చెప్పారు.

మూడవ ప్రణాళిక మొదటి మూడుసంవత్సరాలలో ఉత్తరప్రదేశ్ వెనుకబడిన ప్రాంతాలను కేంద్రం వుద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేసిందని ఆ రాష్ట్ర మాజీముఖ్యమంత్రి చేసిన ఒక ప్రకటనను శ్రీ అర్జున్ అరోరా ప్రస్తావించారు. మంత్రి 'ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యం చేశార'నే ఆరోపణ సరికాదన్నారు.

ప్రభుత్వరంగ పరిశ్రమల బ్యూరో

ప్రభుత్వరంగ పరిశ్రమల పనికి తోడ్పడేటందుకూ, వాటికి సంహా సమాచారాందించేటందుకు త్వరలో ఒక కేంద్ర బ్యూరో ఏర్పాటు చేయతలపెట్టామని మంత్రి మరో సభ్యుని ప్రశ్నకు జవాబిచ్చారు.

ఈ బ్యూరో ఆర్థిక మంత్రిత్వశాఖకూ, ప్రణాళికాసంఘానికీ మధ్య సమన్వయం చేకూర్చే డిపార్టుమెంటుగా వుంటుంది. ప్రభుత్వ రంగ పరిశ్రమలకు సంబంధించిన ముడిసరుకుల అవసరాలు, కంట్రాక్టులు, యితర లావాదేవీలు చూచేటందుకు యిలాంటి ఒక శాఖ అవసరమని ఆయన అన్నారు.

ఆంధ్ర విశ్వ విద్యాలయం:

ఇంజనీరింగ్ పరీక్షా ఫలితాలు

వాల్తేరు, డిసెంబరు 11

1964 సెప్టెంబరు, అక్టోబరు మాసాలలో జరిగిన ఇంజనీరింగు, లా పరీక్షలలో కృతార్థులయిన వారినెంబర్లు ఈ దిగువ యివ్వబడినాయి

ఇంజనీరింగులో మొదటిపరీక్ష

పార్టు I

241A నెంబరు అభ్యర్థి మేథమేటిక్స్ 1, మేథమేటిక్స్ 2, ఫిజిక్స్, కెమిస్ట్రీ మినహా అన్ని సబ్జక్టుల్లో ప్యాసయ్యారు

242 నెంబరు అభ్యర్థి మేథమేటిక్స్ 1 లో తప్పారు.

పార్టు II

మొత్తం పరీక్ష: ఎవరూలేరు.

మేథమేటిక్స్ II లో ఉత్తీర్ణులు: 244 245 246.

అప్లయిడ్ మేథమేటిక్స్‌లో ఉత్తీర్ణులు: లేరు

సివిల్ ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణులు: లేరు.

మెకానికల్ఇంజనీరింగ్ IIలో ఉత్తీర్ణులు: 245 మాత్రం

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ II: 244 మాత్రం

సర్వేయింగ్: లేరు.

ఎస్టిమేటింగ్: 244 మాత్రం.

ఈ దిగువ నెంబర్ల ఫలితాలు తర్వాత ప్రకటించబడతాయి: 247 249

బి. ఇ. డిగ్రీపరీక్ష

పార్టు I

సివిల్ ఇంజనీరింగ్:

మొత్తం పరీక్షలో కృతార్థులు: 12 27 29

మేథమేటిక్స్: 13 15 21

స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్ అండ్ థియరీ ఆఫ్ స్ట్రక్చర్స్ I. 13 15 17 28

హైడ్రాలిక్స్: 13 15 17

జియాలజీ: 15 17 31 32 33 34

సివిల్ ఇంజనీరింగ్ I: 13 15 17 28

సివిల్ ఇంజనీరింగ్ II: 13 15 17 28

సర్వేయింగ్ I: 13 15 17 28

స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ డిజైన్ అండ్ డ్రాయింగ్ I: 15 17

ఎస్టిమేటింగ్, క్వాంటిటీ సర్వేయింగ్, స్పెసిఫికేషన్ · 19 23

దిగువ నెంబర్ల ఫలితాలు తర్వాత ప్రకటించబడతాయి: 22 24 25 28 30

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

మొత్తం పరీక్ష: లేరు.

మేథమేటిక్స్: 49 57

స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్ అండ్ థియరీ ఆఫ్ స్ట్రక్చర్ I: 46 49 52 57

హైడ్రాలిక్స్: 48 57 63

మెకానికల్ టెక్నాలజీ I: 46 మాత్రం.

ఇంజనీరింగ్ ఎలక్ట్రానిక్స్ I: 48 50 54 60 61.

ఎలక్ట్రికల్ మెషినరీ I: 46 మాత్రం.

మెటలర్జీ 46 49 51 52 57.

ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ 46 49 53 57 62 64.

ఎలక్ట్రికల్ డిజైన్ అండ్ డ్రాయింగ్: I 46 48 57 60 65.

వర్క్‌షాప్: 46 48 57.

మెకానికల్ ఇంజనీరింగ్

మొత్తం పరీక్షలో కృతార్థులు: లేరు

మేథమేటిక్స్: 69 72

స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్ అండ్ థియరీ ఆఫ్ స్ట్రక్చర్ I: లేరు

హైడ్రాలిక్స్: 68 70

హీట్ ఇంజన్స్ I: 67 75

థియరీ ఆఫ్ మెషీన్స్ I: 67 71 73 74 75 76

ఫ్యూయల్స్, గ్యాస్ ప్లాంట్సు, బాయిలర్స్: 67 మాత్రం.

ఎలక్ట్రికల్ టెక్నాలజీ I: లేరు

మెటలర్జీ: 69 మాత్రం

మెషీన్ డ్రాయింగ్ అండ్ డిజైన్: లేరు

వర్క్‌షాప్ I: లేరు

టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్

మొత్తం పరీక్షలో కృతార్థులు: 79 మాత్రం

మేథమేటిక్స్: 78 82 86

స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్ అండ్ థియరీ ఆఫ్ స్ట్రక్చర్ I 78 80 82

ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ I: 78 80 82 83 84 87

మెకానికల్ టెక్నాలజీ I: 78 80 82

ఎలక్ట్రికల్ టెక్నాలజీ I 78 80 82

వైర్ కమ్యూనికేషన్ I (టెలిగ్రఫీ) 78 80 82

మెటలర్జీ. 78 80 82

ఇండస్ట్రియల్ ఎకనామిక్స్: 80 84 85

ఎలక్ట్రికల్ డిజైనింగ్ అండ్ డ్రాయింగ్: 78 80 82

వర్క్‌షాప్: 78 80 82

పార్టు II

టెలికమ్యూనికేషన్ యింజనీరింగ్

హానర్స్‌తో మొదటశ్రేణి: 377 78 80 86 92 97 401.

మొదటిశ్రేణి. 374 85 95 400.

రెండవశ్రేణి: 375 76 79 82 90 405.

హెచ్. యఫ్. మెజర్‌మెంట్స్: 384 94 398.

ఎలక్ట్రానిక్ యింజనీరింగ్ II: 384 402 06 07 08.

రేడియో కమ్యూనికేషన్ I: 384 94 96 402.

రేడియో కమ్యూనికేషన్ II: 384 94 96 402.

వైర్ కమ్యూనికేషన్ (టెలిఫోని): 384 94 96 402 08.

కమ్యూనికేషన్ డిజైన్ అండ్ డ్రాయింగ్: 384 96 402 08.

ఎలక్ట్రికల్ టెక్నాలజీ II: 384 94 96 402.

ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్స్: 384 96 408

అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్: 384 94 96 402 407.

వర్క్‌షాప్ II. 384 94 96 402

న్యాయశాస్త్రంలో మొదటి పరీక్ష

మొదటి శ్రేణి: లేరు.

రెండవ శ్రేణి. 6 8 14 16.

డివిజన్ I: 2, 3, 11.

డివిజన్ II: లేరు

డివిజన్ III: లేరు.

ఈ దిగువ నెంబర్ల ఫలితాలు తర్వాత ప్రకటించబడతాయి. 1 12 17

బి. యల్. డిగ్రీపరీక్ష

మొదటి శ్రేణి: లేరు

రెండవ శ్రేణి: 24 25 26 30

ఈ దిగువ నెంబర్ల ఫలితాలు తర్వాత ప్రకటించబడతాయి: 21 23 33

మైసూరులో ధాన్యం లెవీ పద్ధతి

ప్రవేశ పెడుతున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడి

బెంగుళూరు, డిసెంబరు 10

మైసూరు రాష్ట్రంలో ధాన్యం లెవీ పద్ధతిని ప్రవేశ పెడుతున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ నిజలింగప్ప నేడు పత్రికా విలేకరులకు తెలియజేశారు. ధాన్యంకొని నిల్వజేయడానికిగాను తాము ఈ పద్ధతిని ప్రవేశ పెడుతున్నామనీ, తమ యీ ప్రతిపాదనకు కేంద్రం అంగీకరించుతుందనే తాము భావించుతున్నామనీ తెలియజేశారు.

ప్రభుత్వ రంగంలో 30 బియ్యం మిల్లులు

ఒక్కొక్కటి టన్ను ప్రమాణం కలిగిన 30 బియ్యం మిల్లులను ప్రభుత్వం నెలకొల్పబోతున్నదని శ్రీ నిజలింగప్ప తెలియజేశారు. భూమి శిస్తును ధాన్యం రూపంలో వసూలు చేయాలని లోగడ అనుకున్నామనీ కాని యిప్పుడు ఆ పథకాన్ని విరమించామనీ అన్నారు. తక్కావీ రుణాలను ధాన్యరూపంలో వసూలు చేయాలని తాము వాంఛిస్తున్నట్టు తెలియజేశారు.

బర్మా భారతీయుల జీవితభీమా పాలసీల సమస్య

న్యూఢిల్లీ, డిసెంబరు 10

బర్మాలోని పనిస్తూ. జీవితభీమా పాలసీలను తీసికొని, అక్కడ నుండి తిరిగి వచ్చిన భారతీయులకు, వారిపాలసీలు పరిపక్వమైనపక్షంలో ఆ పాలసీలపై న్యాయమైనమేరకు బుణాలను మంజూరు చేయాలని లోక్‌సభలో చేయబడిన సూచనను జీవిత భీమా కార్పొరేషన్‌కు తెలియచేయగలనని ఆర్థిక శాఖ మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి నేడిక్కడ లోక్‌సభలో అన్నారు

బర్మా ప్రభుత్వంతో రాయబారాలు జరిపి పాలసీల ప్రకారం వారికి రావలసిన మొత్తంలో 70 నుండి 75 శాతం వరకు బుణంగా ఇవ్వాలని శ్రీ నారాయణదండేకర్ సూచించారు.

ఒక ప్రశ్నకు సమాధానం చెప్తూ శ్రీ బి ఆర్ భగత్ వ్యక్తిగత అర్హతల ననుసరించి పాలసీలను ట్రాన్స్‌ఫర్ చేసేవిషయం పరిశీలించగలమని బర్మా యూనియన్ బ్యాంక్. జీవిత భీమా కార్పొరేషన్‌కు తెలియజేసిందని అన్నారు.

భారతదేశ విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ ఇటీవల బర్మా సందర్శించినప్పుడు జరిపిన చర్చలలో ఈ అంశం ప్రస్తావించబడినట్లు తాను భావించటం లేదని ఆర్థిక మంత్రి అన్నారు.

త్రిపుర సరిహద్దులో పాకిస్తాన్ సైనికుల తుపాకి కాల్పులు

అగర్తాలా, డిసెంబరు 10

సరిహద్దు రాష్ట్రమైన త్రిపురలోని కరంగిచేరా గ్రామంపై తూర్పుపాకిస్తాన్ సైనికులు డిసెంబరు 7 నుండి వరుసగా తుపాకికాల్పులు జరుపుతున్నారని నేడిక్కడ అధికారులు ప్రకటించారు.

ఈ కాల్పులపై త్రిపురరాష్ట్ర ప్రభుత్వం తూర్పు పాకిస్తాన్ అధికారులకు తీవ్రనిరసన తెలియజేయటం జరిగింది.

తూర్పు పాకిస్తాన్ రైఫిల్‌దళంవారు ఈ విధంగానే గత నవంబరు నెలలో 17 వ తేదీ నుండి ప్రారంభించి ఒక పదిహేను రోజుల పాటు పంటలకు ఆటంకంకల్పించే ఉద్దేశ్యంతో ఈ ప్రాంతంలో కాల్పులు జరిపారని అధికారులు తెలిపారు.

బ్రిటన్‌లో వుండదలచిన భారతీయులు అందుకు తగినట్లుగా వ్యవహరించాలని లండన్ భారత హైకమిషనర్ కార్యాలయం ప్రధమ కార్యదర్శి శ్రీ కె. సి. సేన్ గుప్తా అన్నారు.

అప్రోప్రియేషన్ బిల్లుపై రాజ్యసభలో చర్చ

న్యూఢిల్లీ, డిసెంబరు 11

సప్లిమెంటరీ పద్దులకు సంబంధించిన 1964 అప్రోప్రియేషన్ బిల్లుపై నేడు రాజ్యసభలో అసంపూర్తిగా చర్చ జరిగింది. సప్లిమెంటరీ పద్దుల మొత్తం రు 102,63 కోట్లు.

కేంద్ర ఆర్థికశాఖ ఉపమంత్రి శ్రీ రామేశ్వర్‌సాహు సభలో బిల్లును ప్రవేశ పెడుతూ, ఆహార కొరతను భర్తీ చేసేందుకు ఆహారధాన్యాల దిగుమతికి దాదాపు 100 కోట్ల రూపాయలు కావలసి వుంటుందని అన్నారు.

1965 ఫిబ్రవరి మాసాంతానికి 58 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు, 5.9 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం. దేశంలోకి దిగుమతి చేసికోబడ వచ్చునని ఆయన తెల్పారు అననంగా, దేశంలో కూడా బియ్యాన్ని సేకరించటం జరుగుతుందని. అలాగే థాయిలాండ్, కాంబోడియా, ఐక్యఅరబ్ రిపబ్లిక్‌ల నుండి బియ్యాన్ని దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

ఎగుమతులవల్ల నష్టపడిన పంచదార పరిశ్రమకు సహాయం చేయటంలో ప్రభుత్వం 2కోట్ల రూపాయలు ఖర్చు పెట్టవలసి వుంటుందని కూడా ఈ పద్దులలో పేర్కొనబడింది.

స్వతంత్రపార్టీ సభ్యుడు శ్రీ రామ్‌సింగ్ మాట్లాడుతూ, ఆహారధాన్యం వ్యాపారులవద్ద మాత్రమే నిల్వచేయ బడలేదని, ఉత్పత్తిదారుల, వినిమయదారులవద్దకూడా నిల్వలున్నాయని అన్నారు. వ్యాపారులను ప్రభుత్వం నేరస్థులుగా పరిగణించ కూడదని అన్నారు. ఫ్యాక్టరీలకు అవసరమైన ఇనుప దిమ్మల కొంత ఎక్కువగా వుందని, అవసరమయితే వానిని దిగుమతి చేసేందుకు ప్రభుత్వం పూనుకోవాలని ఆయన అన్నారు.

కాంగ్రెసు సభ్యుడు శ్రీ భవాని ప్రసాద్ తివారి ప్రసంగిస్తూ, 1965 జనవరి నుండి కొన్ని రాష్ట్రాలలో అధికార కార్యకలాపాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రాంతీయ భాషల్లో జరపటానికి తీసుకున్న నిర్ణయాలకు హర్షామోదం ప్రకటించారు. బిలాసిలావద్ద ఉక్కు ఫ్యాక్టరీని నెలకొల్పాలని ఆయన డిమాండ్ చేశారు

భారతీయ పరిస్థితులతో ప్రత్యక్ష సంబంధాలు లేని విదేశీయ విద్యా నిపుణులను విద్యా కమిషన్‌లో సభ్యులుగా నియమించటాన్ని కాంగ్రెసు సభ్యుడు శ్రీ ఎ. కె. ఎ. సిన్హా వ్యతిరేకించారు.

మురికిపేటల బాగుసేత సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 10

తృతీయ పంచవర్ష ప్రణాళికలో గృహనిర్మాణ పథకాల క్రింద రాష్ట్రాలకు కేటాయించబడిన మొత్తంలో 45 శాతం డబ్బు మురిగిపోయిందని గృహనిర్మాణం, పనులశాఖ మంత్రి శ్రీ మెహర్‌చంద్ ఖన్నా నేడిక్కడ రాజ్యసభలో వెల్లడించారు

కేటాయించబడిన ధనాన్ని రాష్ట్రాలు ఖర్చు చేయలేక పోవటంపట్ల మంత్రి విచారం వ్యక్తం చేశారు. మురికిపేటల నిర్మూలనకు, గృహనిర్మాణాలకు తీసుకోదగు చర్యలను గురించి ఆలోచించేందుకై ఈ నెలాఖరులో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నానని ఆయన చెప్పారు.

మురికిపేటలనిర్మూలన సవరణబిల్లు(1964)కు రాజ్యసభ నేడు ఆమోదం తెల్పింది. ఆబిల్లుపై జరిగిన చర్చకు మంత్రి నేడు సమాధానం చెప్పారు. ఈ బిల్లును ఇదివరకే లోక్‌సభ ఆమోదించింది. మురికిపేటల బాగుసేత కార్యక్రమాలలోని అవరోధాలను తొలగించేందుకు ఈబిల్లు ప్రవేశ పెట్టబడిందని మంత్రి అన్నారు. ఈ బిల్లు ఢిల్లీకి మాత్రమే వర్తిస్తుంది.

మురికిపేటల నిర్మూలన పథకానికి అధికతర ప్రాముఖ్య మిస్తామని, అవసరమైతే మధ్య రకం, తక్కువ ఆదాయంవారికి గృహ నిర్మాణానికి, జీవితభీమా కార్పొరేషన్ మంజూరు చేసే రుణాల మొత్తాలను కూడా ఇందుకు వినియోగిస్తామని ఆయన చెప్పారు.

పరిశ్రమలు అభివృద్ధిచెందిన ప్రాంతాలలో అధిక జనాభా నివసిస్తున్న కారణంగా మురికిపేటలు ఏర్పడుతున్నాయని. కనుక ఆ యా పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు గృహవసతి కల్పించాలని మంత్రి అన్నారు. అయితే తమ పెట్టుబడి శక్తికి నష్టంవాటిల్లకుండా పరిశ్రమల్లోపనిచేసే కార్మికులందరికీ ఎప్రిశమాని వసతులు గృహవసతిని కల్పించటం సాధ్యం కాదని మంత్రి అన్నారు.

పరిశ్రమల పెట్టుబడులకు తీవ్ర వ్యాఘాతం కల్గకుండా కార్మికులకు గృహవసతి ఏ మేరకు కల్గించవచ్చు అనే విషయంపై చర్చలు జరిపేందుకు గృహనిర్మాణ శాఖ మంత్రుల సమావేశానికి కార్మిక. పారిశ్రామిక, ప్రతినిధులు. వాణిజ్య మంత్రులు హాజరుకావాలని ఆయన అన్నారు.

గృహనిర్మాణాలకై కేటాయించిన ధనాన్ని ఇతర పథకాలకు వినియోగించ కూడదని రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయవలసిందిగా ప్లానింగ్ కమిషన్‌ను. కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖను కోరుతున్నానని శ్రీ మెహర్‌చంద్ ఖన్నా అన్నారు. గృహ నిర్మాణ శాఖను ఒకే మంత్రి నిర్వహించాలని. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలలోవలె ఇద్దరు, ముగ్గురు మంత్రులు నిర్వహించ కూడదని రాష్ట్ర ప్రభుత్వాలకు తాను తెలియజేశానని ఆయన చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వాలు మురికివాడల నిర్మూలనా పథకాలకు డబ్బును వెచ్చించే స్థితిలో లేవనే విమర్శకు మంత్రి సమాధానమిస్తూ, ఆ పథకాలకు అయ్యే ఖర్చులో 75 శాతాన్ని కేంద్రమే భరిస్తున్నదని. 25 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు. భరించటం కష్టం కాదని అన్నారు.

ఇప్పటికి 9 రాష్ట్రాలు మాత్రమే స్వంత మురికి నిర్మూలన చట్టాలను చేశాయని, మరో 5 రాష్ట్రాలు ఆ విషయం ఆలోచిస్తున్నాయని అన్నారు.

కాశ్మీర్‌లో 'ప్లెబిసైట్ ఫ్రంట్' జండాలు

అభ్యంతరకరంకాదని శ్రీ నందా వివరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 10

కాశ్మీర్‌లో "ప్లెబిసైట్ ఫ్రంట్" తన కార్యాలయాలపై ఎగురవేసిన జెండాలు పాకిస్తాన్ జెండాలవలె లేవనీ, అందుచేత ఆ విషయమై చర్య తీసుకోవలసిన అవసరం ఉన్నట్టు ప్రభుత్వం భావించటం లేదనీ నేడు లోక్‌సభలో హోంశాఖామంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా తెలియజేశారు. వీరు తమ జెండాలను ప్రభుత్వ కార్యాలయాలమీద ఎగురవేయలేదని మంత్రి తెలిపారు

ఆంధ్ర ప్రదేశ్‌లో పంచదార ఉత్పత్తి

శాసనసభలో వివరాల ప్రకటన

హైదరాబాద్, డిసెంబరు 10

ఆంధ్ర ప్రదేశ్‌లోని మొత్తం 19 పంచదార ఫ్యాక్టరీలలోను 1963-64 సంవత్సరంలో 24 లక్షల బస్తాల పంచదార ఉత్పత్తి అయిందని శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రెవెన్యూ మంత్రి వెల్లడించారు.

19 పంచదార ఫ్యాక్టరీలలోను ప్రయివేట్ రంగంలో వున్న 10 ఫ్యాక్టరీలు సుమారు 13 లక్షల బస్తాల పంచదారను ఉత్పత్తి చేసినవి. పబ్లిక్‌రంగంలోని షక్కర్‌నగర్ ఫ్యాక్టరీలో సుమారు 5 లక్షల బస్తాల పంచదార ఉత్పత్తి అయిందని, పోతే సహకార రంగంలో గల మిగతా ఎనిమిది ఫ్యాక్టరీలలోను ఇంచుమించు 6 లక్షల బస్తాల పంచదార ఉత్పత్తి అయినదని ఆయన వివరించారు.

చిత్తూరు, షక్కర్‌నగర్, సీతానగరం, ఉయ్యూరు ఫ్యాక్టరీలలో పంచదార దిగుబడి హెచ్చుగా వున్నదని ఆయన పేర్కొన్నారు.

ఢిల్లీలో విపరీతమైన చలిగాలి

న్యూఢిల్లీ, డిసెంబరు 10

విపరీతమైన చలి ఢిల్లీ నగరాన్ని ముంచెత్తుతున్నది. రేపు సోమవారం వరకు పరిస్థితి ఇలాగే కొనసాగవచ్చు. ఉష్ణోగ్రత 5.9 సెంటిగ్రేడ్ డిగ్రీలకు పడిపోయింది.

కనిగిరి, పొదిలి దర్శి తాలూకాల్లో మంచినీటి బావుల త్రవ్వకంనిలిపివేత

హైదరాబాద్, డిసెంబరు 10

నెల్లూరుజిల్లాలోని కనిగిరి, పొదిలి దర్శి తాలూకాలలో మంచినీటి బావుల త్రవ్వకం నిలిపివేయమని ఆదేశించామని, ఆ ప్రాంతంలోని నీటిని ప్రయోగశాలలో పరీక్షించగా, ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు ఆ నీటిలో వున్నట్టు తేలిందని, కనుక ఆ ప్రాంతంలో బావుల త్రవ్వకం కూడదని ఆదేశించామని నేడు శాసనసభ ప్రశ్నోత్తర సమయంలో పంచాయితీ రాజ్ మంత్రి డాక్టర్ లక్ష్మీనరసయ్య వివరించారు.

అమెరికా నీగ్రో ఉద్యమ కార్యకర్తలను చంపిన వారి విడుదల

మెరిడియాన్, డిసెంబరు 10

అమెరికాలో నీగ్రోల పౌరహక్కులకై ఉద్యమం సాగిస్తున్నవారిలో ముగ్గురిని ఇటీవల హత్యగావించిన సందర్భంలో అరెస్టయిన వారిలో 19 మందిని మిసిసిపి రాష్ట్రంలోని మెరిడియాన్ ఫెడరల్ కమిషనర్ నేడు విడుదల చేశారు. నేరస్థులపై వచ్చిన ఆరోపణలను ఈ కమిషనర్ ప్రాథమిక విచారణలో త్రోసిపుచ్చారు.

రానను కున్నావేమో ఇక రానను కున్నావేమో ఆడిన మాటకు నిలిచేవాడను కాననుకున్నావేమో!
మంచి మనిషి

నేడే
మ్యాటినీతో గొప్ప ప్రారంభం,
శ్రీనివాసమహల్
విజయవాడ
రోజూ 3 ఆటలు
ఆదివారం 4 ఆటలు

పూర్తి
మాయాజాల స్టంటింగ్ చిత్రం
కాలాజాదు

- హెర్క్యులెస్
- చంద్రకళ
- హబీబ్ ముల్లవారు

సంగీతం: ఇక్బల్

పూర్ణా ప్రొడక్షన్స్ రిలీజ్

Suvarna

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

పబ్లిక్‌వర్క్సు డిపార్టుమెంటు (ప్రాజెక్టు విభాగము)

శ్రీశైలము ప్రాజెక్టు సర్కిల్ (సివిల్)

శ్రీశైలము ప్రాజెక్టు కాలనీ

టెండరు నోటీసు నెం. 14/64-65

ఈ దిగువ ఉదహరించిన పనులకుగాను సీలువేసిన టెండర్లు K-2 ఫారములో శ్రీశైలము ప్రాజెక్టు సూపరింటెండింగ్ యింజనీరు వారిచే. శ్రీశైలము ప్రాజెక్టు కాలనీలో వారి కార్యాలయమునందు డి. 19-1-65 సాయంత్రము 4 గంటలవరకు పుచ్చుకొనబడును.

వ. నెం.	పని పేరు	ధరావత్తు రూ.	టెండరు ఫారం ఖరీదు రూ.	కంట్రాక్టు కాలపరిమితి
1.	కృష్ణానది కుడిపార్శ్వమున లింగాలగట్టుకు రోడ్డు వేయుట.	8,750	20-40	ఆరు నెలలు
2.	కృష్ణానది ఎడమ పార్శ్వమున లింగాల గట్టుకు రోడ్డు వేయుట.	3,750	20-40	ఆరు నెలలు
3.	M 56/5 మన్ననూరు రోడ్డునుండి దిండి ఇసుక క్వారీలకు ఈ క్రింది మైళ్ళలో రోడ్డు వేయుట			
	'A' రీచి M 0/0 నుండి M 7/0 వరకు	5,000	20-40	ఆరు నెలలు
	'B' రీచి M 7/0 నుండి M 13/0 + 556" వరకు	5 000	20-40	ఆరు నెలలు

టెండరు ఫారములకు అప్లికేషనులు సూపరింటెండింగ్ ఇంజనీరువారి పర్సనల్ అసిస్టెంటుగారికి పంపుకొనవలయును. టెండరు ఫారముల ఖరీదు మార్కాపురంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచిమీద డ్రాఫ్టుగాగాని (లేక) మార్కాపురంలోని సబ్ ట్రెజరీలో P. W. III Other Remittances ఖాతాకు ఐయిటము 1 కి శ్రీశైలము రైటుప్లాంకు దాము డివిజను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వారిపేర. ఐయిటము 2, 3 లకు శ్రీశైలము లెఫ్ట్ ప్లాంకు డామ్ డివిజను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వారిపేర చెల్లించి సదరు బ్యాంకు డ్రాఫ్టు (లేక) చలాను దరఖాస్తుతో పంపవలయును.

టెండరు ఫారములకు అప్లికేషనులు డి. 8-1-1965 తేదీలోగా పంపుకొనవలయును.

టెండరు ఫారములు ఆఫీసు పనిచేయు కాలములో 9-1-1965 తేదీ తర్వాత ఆఫీసునందు దొరకును.

టెండరు దాఖలుచేయుటకు ఖరీదు ఎట్టి పరిస్థితులలోను వాపసు ఇవ్వబడదు.

ఏ ఒక్క టెండరునుగాని, అన్ని టెండర్లనుగాని ఏ కారణములేక తిరస్కరించే అధికారం సూపరింటెండింగ్ ఇంజనీరు వారికి గలదు.

శ్రీశైలము ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌వారి ఖాతాకు రు 50,000లు స్టాండింగ్ డిపాజిట్ చెల్లించినవారు పైన పేర్కొనబడిన ఎర్నెస్టు మనీ డిపాజిట్‌లో 2/5 వంతు చెల్లించవచ్చును.

(సం.) జె. రాజారావు,
సూపరింటెండింగ్ ఇంజనీర్.

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షులు) ఏటుకూరు బలరామమూర్తి, తుమ్మల వెంకటరామయ్య. విశాలాంధ్ర విజ్ఞానసమితికొరకు ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర అచ్చు ప్రెస్, విజయవాడ-4